


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 287 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) పచురణ : తాడేపల్లిగూడెం ఆదివారం 23 ఆగస్టు 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 287 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM SUN 23 AUGUST 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur



## డీఎస్సీపై చర్చకు రా.. టైమ్, డేట్ నీ ఇష్టం!

### జగన్‌కు నారా లోకేశ్ ఐదోసారి సవాల్

- విజయనగరం నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమావేశం
- డీఎస్సీపై చర్చకు రావాలంటూ జగన్‌కు ఐదోసారి సవాల్ విసిరిన లోకేశ్
- ఉత్తరాంధ్ర అభివృద్ధికి, విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని హామీ
- కష్టపడి పనిచేసే కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తానని భరోసా
- వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చేవారికి నో ఎంట్రీ అని స్పష్టం చేసిన లోకేశ్
- త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపు

పెన్ పవర్ డెస్క్:డీఎస్సీ నియామకాలపై చర్చకు రావాలంటూ వైసీపీ అధినేత జగన్ కు తాను ఐదోసారి సవాల్ విసురుతున్నానని, దమ్ముంటే చర్చకు రావాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ సవాల్ విసిరారు. "టైమ్, డేట్ నువ్వే ఫిక్స్ చెయ్.. డీఎస్సీపై చర్చకు నేను సిద్ధం. తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చోవడం కాదు, బయటకు రా!" అని లోకేశ్ తీవ్ర స్వరంతో జగన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. శనివారం విజయనగరం నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. డీఎస్సీ, ఏపీపీఎస్సీకి మధ్య తేడా కూడా తెలియని వ్యక్తి ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఎలా పనిచేశారని ఆయన ఎద్దేవా చేశారు."ఐదేళ్లలో ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయని జగన్, ఇప్పుడు మేం పారదర్శకంగా భర్తీ చేసిన 16 వేల ఉద్యోగాలపై దుష్ప్రచారం చేస్తున్నారు. వర్టికల్, హారిజాంటల్ రిజర్వేషన్లు అంటే కూడా ఆయనకు అవగాహన లేదు. అసెంబ్లీలో వారి ఆరోపణలకు సమాధానం చెప్పినా, బయటకు వచ్చి మళ్ళీ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. కష్టపడి టెట్, డీఎస్సీ రాసి ఎంపికైన ఉపాధ్యాయులను అవమానించడం మానుకోవాలి" అని లోకేశ్ హితవు పలికారు. జగన్ చెప్పే అబద్ధాలను కార్యకర్తలు బలంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

**కార్యకర్తలే పార్టీకి బలం**

ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే వెన్నెముక అని, వారి

- మిగతా 2లో

## నారా లోకేశ్.. విద్యార్థుల్లో విద్యార్థిగా.. టీచర్లలో టీచర్ గా..!

- విద్యావ్యవస్థలోని సమస్యలను తెలుసుకునేందుకు మంత్రి లోకేశ్ వినూత్న ప్రయత్నం
- విద్యార్థులతో విద్యార్థిలా, ఉపాధ్యాయులతో ఉపాధ్యాయుడిలా మమేకం
- విశాఖలో ఆధునికీకరించిన పాఠశాలను ప్రారంభించి, విద్యార్థులతో సరదాగా ముచ్చట
- విజయనగరంలో ఉపాధ్యాయులతో కలిసి కెమిస్ట్రీ క్లాస్‌లో కూర్చున్న వైనం
- లోకేశ్ ఆచరణాత్మక శైలిపై విద్యార్థులు, ఉపాధ్యాయుల నుంచి హర్షం

- మిగతా 2లో



## ర్యాంక్ వచ్చిన వ్యక్తి వెరిఫికేషన్ కు సర్టిఫికెట్లు తీసుకురాకపోతే అది ఎవరితప్పు?

- మెగా డీఎస్సీపై విమర్శలను తిప్పికొట్టిన సీఎం చంద్రబాబు
- గత ప్రభుత్వంలో గ్రూప్ 1 పేపర్లు ప్లంబర్లతో దిద్దించారని ఆరోపణ
- రాజకీయ చెత్తను కూడా శుభ్రం చేయాలని ప్రజలకు పిలుపు
- గొడ్డలి పార్టీ పాలనలో నకిలీ మద్యంతో 30 వేల మంది చనిపోయారన్న సీఎం
- ఉత్తరాంధ్రను ఇండస్ట్రియల్ కారిడార్‌గా మారుస్తామని హామీ



పెన్ పవర్ డెస్క్:మెగా డీఎస్సీ నియామక ప్రక్రియపై వైసీపీ చేస్తున్న విమర్శలపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. డీఎస్సీలో ఒక్క శాతం కూడా అవినీతి జరగలేదని, జరగనివ్వబోమని ఆయన స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్న ఈ ప్రక్రియకు బురద జల్లే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన గ్రూప్-1 సర్వీస్ పరీక్షల మూల్యాంకనంలో భారీ అవకతవకలు జరిగాయని, ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లు, ఇంట్లో పనిచేసేవారితో సమాధాన పత్రాలు దిద్దించిన వాస్తవాలు వెలుగు చూస్తుండటంతో, ఇప్పుడు డీఎస్సీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు.అనకాపల్లి జిల్లా మాడుగుల నియోజకవర్గంలోని అలమండ కోడూరులో జరిగిన 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో సీఎం చంద్రబాబు ప్రసంగించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ.. "మెగా డీఎస్సీని అడ్డుకోవడానికి 300 పిటిషన్లు వేశారు. వాటన్నింటినీ ఎదుర్కొని ఉద్యోగాలు ఇస్తుంటే, ఏడాది తర్వాత ఆరోపణలు చేస్తున్నారు. ర్యాంక్ వచ్చిన వ్యక్తి వెరిఫికేషన్‌కు సర్టిఫికెట్లు తేకపోతే అదెవరి తప్పు? క్రీడా కోటాను 2 శాతం నుంచి 3 శాతానికి పెంచి ఉద్యోగాలిస్తే, ఎందుకు ఇచ్చారని ప్రశ్నిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాల ప్రకారమే క్రీడాకారులకు

- మిగతా 2లో

### అలవరం కోడూరులో నెట్‌జీరో విధానాన్ని పరిశీలించిన సీఎం చంద్రబాబు..

- నెట్‌జీరో గ్రామమే లక్ష్యం.. అలవరం కోడూరులో సీఎం చంద్రబాబు పర్యటన
- పర్యావరణ పరిరక్షణను ఇంటింటి ఉద్యమంగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమన్న ముఖ్యమంత్రి
- వంటగది వ్యర్థాలతో సేంద్రియ ఎరువు, మురుగునీటికి ఇంటి వద్దే పరిష్కారాలు
- సౌర విద్యుత్‌తో ఇండక్షన్ స్టవ్ వినియోగం ద్వారా గ్యాస్, కరెంట్ ఆదా
- ఆదర్శంగా నిలుస్తున్న నెట్‌జీరో విధానాలను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు ప్రణాళిక





### ఏపీలో నిరుద్యోగులకు శుభవార్త

## 10,060 పోస్టులతో 'జాబ్ క్యాలెండర్ 2026' విడుదల

- విడుదలైన ఏపీ జాబ్ క్యాలెండర్
- 4 దశల్లో 10,060 ఉద్యోగాల భర్తీ
- సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో వరుసగా నోటిఫికేషన్లు
- ఉన్నత విద్యాశాఖలో ఇప్పటికే 1,500 పోస్టుల భర్తీ ప్రక్రియ ప్రారంభం

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ప్రభుత్వం భారీ శుభవార్త అం దించింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 10,060 పోస్టులను భర్తీ చేసేందుకు ఉద్దేశించిన "జాబ్ క్యాలెండర్-2026"ను విడుదల చేసింది. ఈ మేరకు ఆర్థిక

- మిగతా 2లో




## బీజేపీ కొత్త టీమ్‌తో ప్రధాని మోదీ భేటీ

- ఢిల్లీలో బీజేపీ నూతన జాతీయ కార్యవర్గంతో ప్రధాని మోదీ సమావేశం
- కొత్త ఆలోచనలతో పార్టీని బలోపేతం చేయాలని బృందానికి దిశానిర్దేశం
- యువతను లక్ష్యంగా చేసుకుని 'యువ సంవాద్' కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి
- యూపీ, పంజాబ్ ఎన్నికల సన్నద్ధతపై త్వరలో పార్టీ సమీక్ష
- 'వందేమాతరం'పై కాంగ్రెస్ వైఖరిని విమర్శిస్తూ బీజేపీ తీర్మానం

- మిగతా 2లో

## సెప్టెంబరు 1 నుంచి తమిళ సినిమాలు నో రిలీజ్...

- ఓటీటీ స్ట్రీమింగ్ నిబంధనలపై థియేటర్ యాజమాన్యాలతో వివాదం
- ఎనిమిది వారాల తర్వాతే ఓటీటీలో విడుదల చేయాలని డిమాండ్
- నిర్మాతల మండలి కీలక ప్రకటన, షూటింగ్‌లకు ఇబ్బంది లేదు - మిగతా 2లో



## రూ.7,000 కోట్లతో కొత్త ఎల్‌పీజీ పైప్‌లైన్లు..

### తెలంగాణకు ప్రయోజనం



- రూ.7,000 కోట్లతో ఎల్‌పీజీ పైప్‌లైన్ విస్తరణకు కేంద్రం ఆమోదం
- తెలంగాణలోని చర్లపల్లి నుంచి నాగ్‌పూర్ వరకు కీలక మార్గం
- దేశవ్యాప్తంగా 1,800 కిలోమీటర్ల మేర కొత్త లైన్ల నిర్మాణం
- ప్రాజెక్టును చేపట్టనున్న గెయిల్ ఇండియా లిమిటెడ్
- తగ్గనున్న రవాణా ఖర్చులు, ప్రమాదాల ముప్పు

పెన్ పవర్ డెస్క్:దేశంలో ఎల్‌పీజీ సరఫరా వ్యవస్థను మరింత పటిష్ఠం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సుమారు రూ. 7,000 కోట్ల వ్యయంతో ఎల్‌పీజీ పైప్‌లైన్ నెట్‌వర్క్‌ను భారీగా విస్తరించేందుకు పెట్రోలియం, సహజ వాయువు నియంత్రణ

- మిగతా 2లో

## యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ 2026 సీజన్ 2

### పోస్టర్ ఆవిష్కరించిన దిల్ రాజు.. ఫస్ట్ ప్రైజ్ రూ.3 లక్షలు!

పెన్ పవర్ డెస్క్:తెలంగాణ సంస్కృతి, పండుగలు, చరిత్రను తమ కెమెరాతో ప్రపంచానికి చూపించాలనుకునే యువ ఫిల్మ్ మేకర్స్‌కు అదిరిపోయే అవకాశం . బతుకమ్మ పండగ సందర్భంగా తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 'యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ 2026 - సీజన్ 2' నిర్వహించేందుకు రంగం సిద్ధమైంది. యువతలోని సృజనాత్మకతకు పదును

- మిగతా 2లో





## నన్ను, నా కుటుంబాన్ని టార్గెట్ చేశారు..

### మంత్రి కొండా సురేఖ లేఖ

- అవమానకర వ్యాఖ్యలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని క్రమశిక్షణ కమిటీకి విజ్ఞప్తి
- విచారణ జరుగుతున్న సమయంలో తనపై బహిరంగ విమర్శలు చేయడం సరికాదని వ్యాఖ్య
- కుమార్తె వ్యాఖ్యలను సురేఖ ఖండించాలని మల్లు రవి సూచన
- సురేఖ వివరణపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేసిన మల్లు రవి

- మిగతా 2లో

## రూ.150కోట్ల నగదు బదిలీ..

### మరో వివాదంలో బీసీఐ ఛైర్మన్



పెన్ పవర్ డెస్క్: నల్సార్ విశ్వవిద్యాలయానికి సంబం ధించి ఓ నిర్ణయంతో ఇటీవల వార్తల్లో నిలిచిన బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా బీసీఐ ఛైర్మన్ మనన్‌కుమార్ మిశ్ర మరో వివాదంలో చిక్కుకున్నారు. మిశ్ర ఆధ్వర్యంలో బీసీఐలో ఆర్థిక అవకతవకలు, అనుమానాస్పద

- మిగతా 2లో

# ఎడిటర్ వ్యూ

## డీఎస్సీపై చర్చకు రా.. టైమ్, డేట్ నీ ఇష్టం!

- మొదటి పేజి తరువాయి

త్యాగాల పునాదులపైనే పార్టీ నిలబడి ఉందని స్పష్టం చేశారు. "కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం కల్పించే బాధ్యత నాది. కార్యకర్తలు నన్ను వెతుక్కుంటూ రావాల్సిన పనిలేదు. కష్టపడే వారిని నేనే వెతుక్కుంటూ వస్తాను" అని ఆయన భరోసా ఇచ్చారు. కార్యకర్తల సంక్షేమం కోసం రూ.160 కోట్లు ఖర్చు చేసిన ఏకైక పార్టీ టీడీపీ అని గుర్తుచేశారు. గత ప్రభుత్వ హయాంలో కార్యకర్తలపై పెట్టిన అక్రమ కేసులను న్యాయబద్ధంగా తొలగిస్తామని, ఇప్పటికే 75 శాతం కేసులు పరిష్కారమయ్యాయని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న నీరు-చెట్టు బిల్లుల సమస్యను కూడా త్వరలోనే పరిష్కరిస్తామన్నారు.

**ఉత్తరాంధ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం**

గత ఎన్నికల్లో ఉత్తరాంధ్ర ప్రజలు కూటమికి అఖండ విజయాన్ని అందించారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని లోకేశ్ అన్నారు. "భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ, రైల్వే జోన్ ఏర్పాటు వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. టీసీఎస్, కాగ్నిజెంట్, ఇన్ఫోసిస్ వంటి దిగ్గజ కంపెనీలను ఉత్తరాంధ్రకు తీసుకువచ్చి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం" అని హామీ ఇచ్చారు. అయితే, వైసీపీ ఎంపీ గురుమూర్తి కాగ్నిజెంట్ సంస్థకు భూ కేటాయింపును అడ్డుకోవాలని కోర్టును ఆశ్రయించడం వారి అభివృద్ధి నిరోధక వైఖరికి నిదర్శనమని విమర్శించారు.

## అలవరం కోడూరులో నెట్‌జీరో విధానాన్ని పరిశీలించిన సీఎం చంద్రబాబు..

పర్యావరణ పరిరక్షణను ఒక ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా ఇంటింటి ఉద్యమంగా మార్చి, గ్రామాలను స్వచ్ఛంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు 'నెట్‌జీరో' విధానాన్ని అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. కార్బన్ ఉద్గారాలను తగ్గించి, పర్యావరణహిత జీవనశైలిని ప్రోత్సహించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. శనివారం 'స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా అనకాపల్లి జిల్లా మాడుగుల నియోజకవర్గంలోని అలవరం కోడూరు గ్రామంలో సీఎం పర్యటించారు.ఈ సందర్భంగా, గ్రామంలో అమలు చేస్తున్న నెట్‌జీరో కార్యక్రమాల గురించి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ముఖ్యమంత్రికి వివరించారు. ఇంటింటా సౌర విద్యుత్ వినియోగం, పరిశుభ్రమైన వంట విధానాలు, తడి చెత్తతో సేంద్రియ ఎరువుల తయారీ, మురుగునీటిని ఇంటి వద్దే శుద్ధి చేయడం వంటి పద్ధతుల ద్వారా గ్రామాలను ఎలా ఆదర్శంగా తీర్చిదిద్దుతుం

**క్షేత్రస్థాయిలో కార్యక్రమాల పరిశీలన**

కార్యక్రమం అమలును క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు సీఎం చంద్రబాబు, గ్రామానికి చెందిన జె. మహేశ్వరరావు ఇంటిని సందర్శించారు. మహేశ్వరరావు కుటుంబం చేపడుతున్న పర్యావరణహిత కార్యక్రమాలను సీఎం ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. వంటింటి నుంచి వెలువడే తడి వ్యర్థాలను ప్రత్యేక కంపోస్ట్ గుంతలో వేసి సేంద్రియ ఎరువుగా మార్చుతున్న విధానాన్ని వారు ముఖ్యమంత్రికి చూపించారు. దీనివల్ల ఎరువుల ఖర్చు తగ్గడమే కాకుండా, వ్యర్థాల నిర్వహణ భారం కూడా తగ్గుతుందని వివరించారు.అలాగే, ఇంటి నుంచి వెలువడే మురుగునీటిని బయటకు వదలకుండా, ఆవరణలోనే నిర్మించిన ఇంకుడు గుంతలోకి మళ్లిస్తున్న విధానాన్ని సీఎం పరిశీలించారు. ఈ 'ఇన్‌సిటు వేస్ట్‌వాటర్ మేనేజ్‌మెంట్' వల్ల రోడ్లపై మురుగు నిలవకుండా, దోమల బెడద తగ్గి, ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని లబ్ధిదారులు తెలిపారు. ప్రభుత్వం 'దీపం' పథకం కింద సిలిండర్లు అందిస్తున్నప్పటికీ, ఇండక్షన్ స్టవ్ వాడకం ద్వారా గ్యాస్‌పై ఆధారాపడటాన్ని తగ్గించుకుంటున్నామన్నారు. ఇంటిపై ఏర్పాటు చేసిన 3 కిలోవాట్ల సోలార్ ప్యానెల్ ద్వారా వచ్చే విద్యుత్‌తోనే ఇండక్షన్ స్టవ్ నడుపుతుండటంతో కరెంట్ బిల్లు కూడా ఆదా అవుతోందని వివరించారు. ఈ ఆదర్శ విధానాలను పాటిస్తున్న మహేశ్వరరావు కుటుంబాన్ని ముఖ్యమంత్రి అభినందించి, వారితో సెల్ఫీ దిగారు. అలవరం కోడూరులో అమలవుతున్న నెట్‌జీరో విధానాలను రాష్ట్రంలోని ఇతర గ్రామాలకు విస్తరింపజేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు.

## సెప్టెంబరు 1 నుంచి తమిళ సినిమాలు నో రిలీజ్...

తమిళ చిత్ర పరిశ్రమలో మరోసారి సంక్షోభం నెలకొంది. ఓటీటీ స్ట్రీమింగ్ నిబంధనలపై థియేటర్ యాజమాన్యాలతో తలెత్తిన విభేదాల నేపథ్యంలో, 2026 సెప్టెంబర్ 1 నుంచి కొత్త సినిమాల విడుదలను నిలిపివేయాలని తమిళ ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ (టీఎఫ్‌పీసీ) కీలక నిర్ణయం తీసుకుంది.ఈ వివాదానికి ప్రధాన కారణం.. థియేటర్లలో విడుదలైన సినిమాలను ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలో స్ట్రీమింగ్ చేసే కాలపరిమితి. సినిమా విడుదలైన ఎనిమిది వారాల తర్వాతే ఓటీటీలోకి రావాలని థియేటర్ల యజమానులు డిమాండ్ చేస్తున్నారు. సినిమాలు త్వరగా ఓటీటీలో అందుబాటులోకి రావడం వల్ల ప్రేక్షకులు థియేటర్లకు రావడం తగ్గుతోందని, తద్వారా తమ వ్యాపారం తీవ్రంగా దెబ్బతింటోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే, నిర్మాతలు మాత్రం తమ వాణిజ్యపరమైన వెసులుబాటును కోరుకుంటున్నారు. ఈ వివాదం పరిష్కారమయ్యే వరకు కొత్త సినిమాలను విడుదల చేయకూడదని నిర్మాతల మండలి స్పష్టం చేసింది. అయితే, ఇది పూర్తిస్థాయి బంద్ కాదని, సినిమా షూటింగ్‌లు, పోస్ట్ ప్రొడక్షన్ పనులు యథావిధిగా కొనసాగుతాయని వెల్లడించింది. నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, తమిళనాడు థియేటర్ యజమానుల సంఘం ప్రతినిధుల మధ్య జరిగిన చర్చల అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ పరిణామం సెప్టెంబర్ నెలతో పాటు ఆ తర్వాత విడుదల కావాల్సిన పలు చిత్రాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

## యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ 2026 సీజన్ 2 పోస్టర్ ఆవిష్కరించిన దిల్ రాజు.. ఫస్ట్ ప్రైజ్ రూ.3 లక్షలు!

- మొదటి పేజి తరువాయి

పెట్టడంతో పాటు.. భవిష్యత్ సినీ ప్రయాణానికి ఓ మంచి ప్లాట్‌ఫామ్‌గా ఈ పోటీలు నిలవనున్నాయి. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను టీఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు, ఎండీ జి. ముకుంద రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ రాజ్ కొండా, టీఎఫ్‌డీసీ ఈడీ కిషోర్ బాబులతో కలిసి ఆవిష్కరించారు.

రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, తెలంగాణ చరిత్ర, సంస్కృతి, పండుగలు, కళారూపాలను ఇతివృత్తాలుగా తీసుకుని షార్ట్ ఫిల్మ్స్, పాటల పోటీలు నిర్వహించనున్నట్లు దిల్ రాజు తెలిపారు. ఈసారి పోటీలను మరింత విస్తృతం చేస్తూ కొత్తగా జానపద పాటలు, ప్రభుత్వ పథకాలపై ఇన్‌ఫ్లుయెన్సర్ల వీడియోలు, వ్యాసాలు కు కూడా ఈ 'యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ 2026 -- సీజన్ 2' లో అవకాశం కల్పించినట్లు వెల్లడించారు. యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని దిల్ రాజు కోరారు.

**యువతకు సినీ రంగంలో అవకాశాలు..**

ఈ పోటీలు యువతకు భవిష్యత్తులో సినీ రంగంలో అవకాశాలను సృష్టిస్తాయని, సృజనాత్మక కంటెంట్‌కు వేదికగా నిలుస్తాయని క్రియేటివ్ డైరెక్టర్ రాజ్ కొండా తెలిపారు. తెలంగాణ సంప్రదాయాలు, సంస్కృతి, పండగలు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు విస్తృత స్థాయిలో ప్రాచుర్యం పొందేందుకు ఈ పోటీలు దోహదం చేస్తాయని అన్నారు.

**రూ.3 లక్షల బంపర్ ప్రైజ్..**

ఈ పోటీల్లో విజేతలకు భారీ నగదు బహుమతులు అందించనున్నారు. ప్రథమ బహుమతి రూ.3 లక్షలు, ద్వితీయ బహుమతి రూ.2 లక్షలు, తృతీయ బహుమతి రూ.1 లక్షగా ప్రకటించారు. మరో ఐదుగురికి ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున కన్సోలేషన్ ప్రైజ్ అందించనున్నారు. విజేతలకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు కూడా అందజేస్తారు.

**డెడ్‌లైన్ ఎప్పుడంటే?**

షార్ట్ ఫిల్మ్ నిడివి 3 నిమిషాలకు, పాటల రన్‌టైమ్ 5 నిమిషాలకు మించకూడదు. వీడియోలు 4ఖ రిజల్యూషన్‌లో ఉండాలి. ఆసక్తి ఉన్నవారు తమ ఎంట్రీలను 2026 సెప్టెంబర్ 15లోపు youngfilmmakerschallenge@gmail.comకు లేదా 8125834009 వాట్సాప్ నంబర్‌కు పంపాలని తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ తెలిపింది.నిపుణులతో కూడిన జ్యూరీ ఉత్తమ ప్రతిభను ఎంపిక చేయనుంది. యువతకు భవిష్యత్‌లో సినీ అవకాశాలకు మార్గం చూపడంతో పాటు తెలంగాణ గొప్పదనాన్ని కొత్త తరానికి, ప్రపంచానికి పరిచయం చేసే వేదికగా ఈ ఛాలెంజ్ నిలవనుంది. మీ కథ.. మీ కెమెరా.. మీ క్రియేటివిటీ.. చూపించి రూ.3 లక్షల బహుమతి అందుకోండి మరి.

# ర్యాంక్ వచ్చిన వ్యక్తి వెరిఫికేషన్ కు సర్టిఫికెట్లు తీసుకురాకపోతే అది ఎవరితప్పు?

- మొదటి పేజి తరువాయి

ప్రాధాన్యం ఇచ్చాం. ఎవరో ఎక్కడో డబ్బులు అడిగారని మొత్తం డీఎస్సీకి అంటగట్టడం దుర్మార్గం. గొడ్డలి పార్టీ అధినేత పీఏ వందల కోట్లు సంపాదించారు, దాని గురించి ఎవరూ మాట్లాడరేం?" అని నిలదీశారు. తప్పు చేసిన వ్యక్తులు చట్టం నుంచి తప్పించుకోలేరని ఆయన హెచ్చరించారు.

గత ఐదేళ్ల పాలనపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "ఐదేళ్ల పాటు గొడ్డలి పార్టీ విధ్వంసాలు, నేరాలు, ఘోరాలనే నమ్ముకుంది. వారి హయాంలో సరఫరా చేసిన నకిలీ మద్యం కారణంగా రాష్ట్రంలో సుమారు 30 వేల మంది అనారోగ్యంతో చనిపోయారు. కల్తీ మద్యంతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తెచ్చి, తమకు నచ్చని వారి భూములను 22ఏ జాబితాలో పెట్టారు. ఆ దుర్మార్గాలను సరిదిద్దడానికే మాకు మూడేళ్ల సమయం పడుతోంది. ఇప్పుడు మేం ప్రతి నెలా 9వ తేదీన 'మీ భూమి-మీ హక్కు' పేరుతో రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్తకాలు అందిస్తున్నాం. హిందువుల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరించారు. ఉపాధ్యాయులను అగౌరవపరిచారు" అని చంద్రబాబు ఆరోపించారు. కూటమి ప్రభుత్వం రెండింతల సంక్షేమం అందిస్తూనే అభివృద్ధి పనులు చేస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. "గత పాలకులు సంక్షేమం ఇస్తున్నామని చెప్పి రోడ్లు కూడా వేయలేదు. మేము అధికారంలోకి వచ్చాక రోడ్ల రూపురేఖలు మార్చాం. ప్రజలు ఈ చెత్తతో పాటు రాజకీయ చెత్తను కూడా కడిగేయాలి. ఎన్నికల్లో డబ్బు ప్రభావం లేకుండా చేయాల్సిన బాధ్యత ప్రజలదే. అప్పుడే రాజకీయ నేతలూ తప్పులు చేయరు" అని పిలుపునిచ్చారు.

'దీపం 2.0' ద్వారా నాలుగు నెలలకు ఒకసారి మూడు గ్యాస్ సిలిండర్ల డబ్బులను ఆడబిడ్డల ఖాతాల్లో వేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో ఇప్పుడు ప్రైవేటు నుంచి ప్రభుత్వ స్కూళ్లకు విద్యార్థులు వస్తున్నారని, ప్రపంచాన్ని జయించే విద్యార్థులను తీర్చిదిద్దే శక్తి మన ఉపాధ్యాయులకు ఉందని అన్నారు. ప్రతి గ్రామం 'జీరో వేస్ట్' గ్రామంగా మారాలని ఆకాంక్షించారు. "రెండేళ్లలో రాష్ట్రంలో 143 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను డిస్పోజ్ చేశాం. చెత్త నుంచి గ్యాస్, ఎరువులు తయారు చేస్తున్నాం. స్వచ్ఛ రథాల ద్వారా చెత్త సేకరించి, నిత్యావసర సరుకులు అందిస్తున్నాం. 'స్వయం' పేరుతో డ్వాక్రా సంఘాల ఉత్పత్తులకు బ్రాండింగ్ కల్పిస్తున్నాం" అని వివరించారు.

ఈ సందర్భంగా పలు హామీలు ఇచ్చారు. 30 ఏళ్ల క్రితం ప్రారంభించిన వెలిగొండ ప్రాజెక్టును ఈ నెల 31న ప్రారంభిస్తున్నామన్నారు. వచ్చే నెలలోనే పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి నీరందిస్తామని ప్రకటించారు. ఉత్తరాంధ్రను పారిశ్రామిక కారిడార్‌గా తీర్చిదిద్దుతామని, 10 వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ టౌన్‌షిప్ నిర్మిస్తామని చెప్పారు. స్థానిక యువతకు స్కిల్ సెంటర్లు ఏర్పాటు చేసి నైపుణ్యాలు అందిస్తామన్నారు. రూ.29 కోట్లతో ఎన్టీఆర్ రిజర్వాయర్ పనులు, రైవాడ ప్రాజెక్టును పూర్తి చేసి ఈ ప్రాంతానికి సాగు, తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలు మంచి చెడులను విశ్లేషించి, మంచి ప్రభుత్వాన్ని ప్రోత్సహించాలని కోరారు.

# నారా లోకేశ్.. విద్యార్థుల్లో విద్యార్థిగా.. టీచర్లలో టీచర్ గా..!

విద్యావ్యవస్థలో క్షేత్రస్థాయి వాస్తవాలను తెలుసుకునేందుకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అనుసరిస్తున్న వినూత్న పంథా అందరినీ ఆకట్టుకుంటోంది. సంప్రదాయ పర్యటనలకు భిన్నంగా, ఎలాంటి ఆర్భాటాలు లేకుండా ఆయన నేరుగా విద్యార్థులు, ఉపాధ్యాయులతో మమేకమవుతున్నారు. వారిలో ఒకరిగా కలిసిపోయి, సమస్యలను అడిగి తెలుసుకుంటూ అక్కడికక్కడే పరిష్కారాలకు చొరవ చూపుతున్నారు. "ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్" రూపకల్పనే లక్ష్యంగా ఆయన చేస్తున్న ఈ ప్రయత్నం విద్యావర్గాల్లో కొత్త ఆశలు రేపుతోంది.

విశాఖ జిల్లా భీమిలి నియోజకవర్గంలోని చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దివీస్ సంస్థ సహకారంతో ఆధునీకరించిన భవనాలను మంత్రి లోకేశ్ ప్రారంభించారు. గతంలో తాను ఈ పాఠశాలను సందర్శించినప్పుడు క్రీడా మైదానం మోకాలి లోతు నీటిలో ఉండటాన్ని గమనించారు. విద్యార్థుల ఇబ్బందులను అర్థం చేసుకుని, దివీస్ యాజమాన్యంతో మాట్లాడి అత్యాధునిక సౌకర్యాలతో పాఠశాలను అభివృద్ధి చేసేలా ఒప్పించారు. నేడు కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా మారిన తరగతి గదులు, ప్రయోగశాలలు, ఆధునాతన ప్లేగ్రౌండ్‌ను చూసి ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా, ప్రసంగాలకే పరిమితం కాకుండా విద్యార్థులకు మైక్ అందించి వారి అభిప్రాయాలు, ఆలోచనలు తెలుసుకున్నారు. వారు అడిగిన సరదా ప్రశ్నలకు అంతే ఉత్సాహంగా సమాధానాలిచ్చి వారిలో ఒకరిగా కలిసిపోయారు.

అనంతరం విజయనగరం పర్యటనలోనూ లోకేశ్ తన ప్రత్యేకతను చాటుకున్నారు. దాసన్నపేట బాలికోన్నత పాఠశాలలో జరుగుతున్న స్కూల్ క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశానికి ఆయన హాజరయ్యారు. అక్కడ ఉపాధ్యాయులకు కెమిస్ట్రీపై పునశ్చరణ తరగతులు జరుగుతుండగా, వారికి ఎలాంటి ఆటంకం కలిగించకుండా నిశ్శబ్దంగా వెళ్లి ఉపాధ్యాయుల మధ్య కూర్చున్నారు. శ్రద్ధగా పాఠం వింటూనే, విరామ సమయంలో వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తన దృష్టికి వచ్చిన అంశాలపై తక్షణమే ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కార మార్గాలను అన్వేషించారు.మంత్రి హోదాను పక్కనపెట్టి, క్షేత్రస్థాయిలో వాస్తవాలను తెలుసుకునేందుకు లోకేశ్ అనుసరిస్తున్న ఈ ఆచరణాత్మక విధానంపై ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇది సమస్యల పరిష్కారం పట్ల ఆయనకున్న చిత్తశుద్ధిని తెలియజేస్తోందని అభిప్రాయపడుతున్నారు.

# రూ.7,000 కోట్లతో కొత్త ఎల్‌పీజీ పైప్‌లైన్లు..

- మొదటి పేజి తరువాయి

మండలి (పీఎన్‌జీఆర్‌బీ) ఆమోదం తెలిపింది. ఈ బృహత్తర ప్రాజెక్టు ద్వారా తెలంగాణ రాష్ట్రానికి గణనీయమైన లబ్ధి చేకూరనుంది.ప్రభుత్వ రంగ సంస్థ గెయిల్ (ఇండియా) లిమిటెడ్ ఆధ్వర్యంలో సుమారు 1,800 కిలోమీటర్ల మేర కొత్త పైప్‌లైన్లను నిర్మించనున్నారు. ఇందులో భాగంగా తెలంగాణలోని చర్లపల్లి నుంచి మహారాష్ట్రలోని నాగ్‌పూర్ వరకు 556 కిలోమీటర్ల పొడవైన పైప్‌లైన్‌ను ఏర్పాటు చేయనున్నారు. దీనితో పాటు ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీ నుంచి ఉత్తరాఖండ్‌లోని సితార్‌గంజ్ వరకు (611 కి.మీ.), మహారాష్ట్రలోని శిక్రాపూర్ నుంచి కర్ణాటక, గోవాలోని హుబ్లీ వరకు (633 కి.మీ.) మరో రెండు ప్రధాన మార్గాలను కూడా నిర్మించనున్నారు.

ఈ పైప్‌లైన్లు తెలంగాణ, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, కర్ణాటక, గోవా రాష్ట్రాల గుండా వెళతాయి. ఈ ప్రాజెక్టు పూర్తయితే దేశంలోని మొత్తం ఎల్‌పీజీ పైప్‌లైన్ నెట్‌వర్క్ ప్రస్తుతం ఉన్న 7,700 కిలోమీటర్ల నుంచి 9,500 కిలోమీటర్లకు విస్తరిస్తుంది. పైప్‌లైన్ల ద్వారా గ్యాస్ సరఫరాను పెంచడం వల్ల రవాణా ఖర్చులు తగ్గడమే కాకుండా, రహదారులపై ట్రాఫిక్ రద్దీ, ప్రమాదాల ముప్పు కూడా గణనీయంగా తగ్గుతాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

# బీజేపీ కొత్త టీమ్‌తో ప్రధాని మోదీ భేటీ

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో బీజేపీ నూతన జాతీయ పదాధికారులతో సమావేశమయ్యారు. కొత్త ఆలోచనలు, దృక్పథాలతో పార్టీని మరింత బలోపేతం చేయాలని, ప్రజలతో పార్టీకి ఉన్న సంబంధాలను మరింతగా పెంచుకోవాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. సంస్థాగత సమావేశాలు ఇలాంటి కొత్త ఆలోచనలకు వేదికగా నిలుస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. సమావేశం అనంతరం ప్రధాని మోదీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో ఫొటోలను పంచుకున్నారు. "సంస్థాగత సమావేశాలు పార్టీని బలోపేతం చేయడానికి, ప్రజలతో సంబంధాలు పెంచుకోవడానికి కొత్త ఆలోచనలను అందిస్తాయి. కొత్త బృందంతో సమావేశం అద్భుతంగా జరిగింది," అని ఆయన పేర్కొన్నారు. పార్టీ కార్యాలయానికి విచ్చేసిన ప్రధానికి బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబిన్ స్వాగతం పలికారు. ఈ వారం మొదట్లో ప్రకటించిన నితిన్ నబిన్ కొత్త జాతీయ బృందంతో ప్రధాని మోదీ భేటీ కావడం ఇదే తొలిసారి.

ఈ కొత్తగా నియమించిన 65 మంది సభ్యుల బృందంలో 51 మంది కొత్త ముఖాలకు అవకాశం కల్పించడం గమనార్హం. రాబోయే రోజుల్లో చేపట్టబోయే పలు సంస్థాగత, ప్రజా సంబంధ కార్యక్రమాలపై ఈ సమావేశంలో చర్చించారు. ముఖ్యంగా యువతతో మమేకం కావడమే లక్ష్యంగా 'యువ సంవాద్' (యువతతో సంప్రదింపులు) కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. 14 ఏళ్లు పైబడిన యువతను లక్ష్యంగా చేసుకుని ప్రత్యేక కార్యక్రమాలు రూపొందిస్తున్నారు. ఈ కార్యక్రమాల సమన్వయ బాధ్యతను భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం)కు అప్పగించారు.అలాగే, రాబోయే ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలకు పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంపై కూడా దృష్టి సారించారు. దీనిపై సమీక్షించేందుకు ఆదివారం పార్టీ అధ్యక్షుడు నితిన్ నబిన్.. రాష్ట్రాల బీజేపీ అధ్యక్షులు, సంస్థాగత ప్రధాన కార్యదర్శులు, రాష్ట్రాల ఇన్‌ఛార్జ్‌లతో మరో సమావేశం నిర్వహించనున్నారు.

**'వందేమాతరం'పై బీజేపీ తీర్మానం**

ఇదే సమయంలో, 'వందేమాతరం' గౌరవాన్ని, చారిత్రక వారసత్వాన్ని కాపాడతామంటూ బీజేపీ శనివారం ఒక తీర్మానాన్ని ఆమోదించింది.

1937 నాటి తీర్మానానికి కట్టుబడి, జాతీయ గీతంలోని మొదటి రెండు చరణాలను మాత్రమే ఆలపించాలన్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ నిర్ణయాన్ని బీజేపీ తీవ్రంగా విమర్శించింది. మతపరమైన ఒత్తిళ్లు, రాజకీయ బుజ్జగింపులు, ఓటు బ్యాంకు రాజకీయాల కోసం వందేమాతరాన్ని కుదించే ప్రయత్నాలను వ్యతిరేకిస్తామని స్పష్టం చేసింది. వందేమాతరం చరిత్ర, ప్రాముఖ్యతపై దేశవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రకటించింది.

# రూ.150కోట్ల నగదు బదిలీ.. మరో వివాదంలో బీసీఐ ఛైర్మన్

- మొదటి పేజి తరువాయి

నియామకాలు చోటుచేసుకున్నాయని కో-ఛైర్మన్ వై.ఆర్ సదాశివరెడ్డి ఆరోపించారు. కౌన్సిల్ అను మతి లేకుండా ఆయన బంధువులకు నియామ కాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. అధికారాలను దుర్వినియోగం చేసినందుకు గాను 15 రోజుల్లోగా పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఆరోపణలపై చర్చించేందుకు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను కోరారు.

**ప్రైవేట్ ట్రస్ట్‌కు రూ.150కోట్ల బదిలీ**

బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా బీసీఐ ట్రస్ట్‌ను మనన్‌కుమార్ మిశ్ర పని చేయకుండా అడ్డుకున్నారని.. దాని స్థానంలో 2020లో 'బీసీఐ ట్రస్ట్ పెరల్ ఫస్ట్' అనే కొత్త ట్రస్ట్‌ను నమోదు చేశారని సదాశివరెడ్డి ఆరోపించారు. బీసీఐ నిధుల నుంచి రూ.150 కోట్లను ఈ ట్రస్ట్‌కు బదిలీ చేయడానికి ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. ట్రస్ట్‌కు విరాళాలు ఇవ్వాలని.. దీజ× నుంచి గుర్తింపు, పునరుద్ధరణను కోరిన లా కళాశాలలను డిమాండ్ చేసేవారని ఆరోపించారు. చట్టబద్ధమైన నిధులను ప్రైవేట్ ట్రస్ట్‌కు బదిలీ చేసినందుకు ఆయనపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరారు.

బీసీఐ సిబ్బందిలో ఎక్కువ మంది మనన్‌కుమార్ మిశ్ర కుటుంబ సభ్యులు, ఆయనతో వ్యక్తిగత సంబంధాలు ఉన్నవారేనని సదాశివ పేర్కొన్నారు. వారి నియామకాలను సమర్థించేలా ఎంపిక కమిటీలు.. మెరిట్ జాబితాల రికార్డులు కౌన్సిల్ వద్ద లేవన్నారు. నిధులు, నియామకాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించడానికి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, ఆడిట్ నిర్వహించాలని డిమాండ్ చేశారు.

**ఎన్నుకున్నందువల్లే పదవిలో ఉన్నా..**

తనపై వస్తున్న ఆరోపణలపై బీసీఐ ఛైర్మన్ మనన్‌కుమార్ మిశ్ర స్పందించారు. బీసీఐ పార్లమెంట్ చట్టం కింద ఏర్పడిందని.. ఛైర్మన్ పదవీకాలంపై ఆ చట్టం ఎలాంటి పరిమితిని విధించలేదని పేర్కొన్నారు. ఆ చట్ట ప్రకారమే ఆరుసార్లు ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యానని తెలిపారు. పదవి నుంచి వైదొలగే సమస్యే లేదన్నారు.

## ఏపీలో నిరుద్యోగులకు శుభవార్త 10,060 పోస్టులతో 'జాబ్ క్యాలెండర్ 2026' విడుదల

- మొదటి పేజి తరువాయి

శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ ఆగస్టు 22, 2026న జీవో నెం.81ను జారీ చేశారు. ఈ నియామక ప్రక్రియను నాలుగు విడతల్లో పూర్తి చేయనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఏపీపీఎస్సీ, ఏపీఎస్ఎల్‌పీఆర్‌బీ (పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు), డీఎస్సీ వంటి నియామక సంస్థల ద్వారా ఈ పోస్టులను భర్తీ చేయనున్నారు.ప్రభుత్వ ప్రాధాన్యతలైన మౌలిక సదుపాయాల కల్పన, విద్య, సంక్షేమం, శాంతిభద్రతల పరిరక్షణ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని, "స్వర్ణాంధ్రఏ2047" లక్ష్యాలకు అనుగుణంగా ఈ పోస్టుల భర్తీకి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మొత్తం 10,060 పోస్టులను నాలుగు దశల్లో భర్తీ చేయనుండగా, వాటి షెడ్యూల్ కింది విధంగా ఉంది:

మొదటి విడత: 1,523 పోస్టులు (ఇప్పటికే ఉన్నత విద్యా శాఖ 2026 మే 15న నోటిఫికేషన్ జారీ చేసింది).

రెండో విడత: 3,231 పోస్టులు (నోటిఫికేషన్ తేదీ: 2026 సెప్టెంబర్ 15).

మూడో విడత: 2,311 పోస్టులు (నోటిఫికేషన్ తేదీ: 2026 అక్టోబర్ 15).

నాలుగో విడత: 2,995 పోస్టులు (నోటిఫికేషన్ తేదీ: 2026 అక్టోబర్ 15).

**ఇప్పటికే తొలి దశ నోటిఫికేషన్ జారీ కాగా, మిగతా మూడు దశల వివరాలు ఇవిగో!**

రెండో విడత: 3,231 పోస్టులు (నోటిఫికేషన్: 2026 సెప్టెంబర్ 15)

సెప్టెంబర్‌లో జారీ చేయనున్న ఈ నోటిఫికేషన్‌లో గ్రూప్-1 సర్వీసులతో పాటు పోలీస్ శాఖలో అత్యధిక పోస్టులు ఉన్నాయి.

సెప్టెంబర్‌లో జారీ చేయనున్న ఈ నోటిఫికేషన్‌లో గ్రూప్-1 సర్వీసులతో పాటు పోలీస్ శాఖలో అత్యధిక పోస్టులు ఉన్నాయి.

గ్రూప్-1 సర్వీసులు (149 పోస్టులు): డిప్యూటీ కలెక్టర్: 11 డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ): 36 అసిస్టెంట్ కమిషనర్ (ఎస్టీ): 14 మున్సిపల్ కమిషనర్ గ్రేడ్-××: 12 డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్: 35 డిప్యూటీ రిజిస్ట్రార్ (సహకార శాఖ): 10

ఇతర కీలక పోస్టులు (3,082): పోలీస్ శాఖ: సివిల్ ఎస్సై (182), ఏఆర్ ఎస్సై (116), సివిల్ కానిస్టేబుల్స్ (542), ఏఆర్ కానిస్టేబుల్స్ (205), కమ్యూనికేషన్ కానిస్టేబుల్స్ (200), ఏపీఎస్పీ ఎస్సై (71), ఏపీఎస్పీ కానిస్టేబుల్స్ (80) సహా మొత్తం 1,500కు పైగా పోస్టులున్నాయి.

ఇతర శాఖలు: వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ (164), అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ (196), ఫైర్‌మెన్ (158), జైలు వార్డర్లు (171), హార్టికల్చర్ ఆఫీసర్ (45), ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గ్రేడ్-××× (దేవాదాయ శాఖ) (104).

మూడో విడత: 2,311 పోస్టులు (నోటిఫికేషన్: 2026 అక్టోబర్ 15)

ఈ దశలో గ్రూప్-2, ఇంజనీరింగ్, ప్రొహిబిషన్ శాఖల్లోని కీలక పోస్టులను భర్తీ చేయనున్నారు.

గ్రూప్-2 సర్వీసులు (673 పోస్టులు): డిప్యూటీ తహశీల్దార్: 200 డిప్యూటీ మండల పరిషత్ డెవలప్‌మెంట్ ఆఫీసర్: 176 గూడ్స్ అండ్ సర్వీస్ ట్యాక్స్ ఆఫీసర్ (జీఎస్టీఓ): 40 ప్రొహిబిషన్ ఒ ఎక్సైజ్ సబ్-ఇన్‌స్పెక్టర్: 25 సబ్-రిజిస్ట్రార్ గ్రేడ్-××: 7 సచివాలయం, హెచ్‌ఓడీలలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లు, అకౌంటెంట్లు.

ఇంజనీరింగ్, ఇతర పోస్టులు (1,638): అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు (ఏఈఈ): ఇరిగేషన్ (224), పంచాయతీరాజ్ (100), గ్రామీణ నీటి సరఫరా (73), ఆర్‌డబీ (75) సహా పలు శాఖల్లో మొత్తం 428 పోస్టులు.

విద్యుత్ సంస్థల్లో ఏఈఈలు: ఏపీ ట్రాన్స్‌కో (200), ఏపీ జెన్‌కో (100), డిస్కంలు (మొత్తం 329) కలిపి 629 పోస్టులు.

ఇతరాలు: ప్రొహిబిషన్ ఒ ఎక్సైజ్ కానిస్టేబుల్ (400), అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (50).

నాలుగో విడత: 2,995 పోస్టులు (నోటిఫికేషన్: 2026 అక్టోబర్ 15)

ఈ విడత దాదాపు పూర్తిగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి (మెగా డీఎస్సీ) కేటాయించారు.

పాఠశాల విద్యా శాఖ (2,991 పోస్టులు): సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ), స్కూల్ అసిస్టెంట్లు, ఇన్‌స్ట్రక్టర్లు, డీఈవో పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేయనున్నారు. సబ్జెక్టుల వారీగా ఖాళీల వివరాలను సంబంధిత డీఎస్సీ నోటిఫికేషన్‌లో ప్రకటిస్తారు.

వయోజన విద్య: అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టులు 4 ఉన్నాయి.

ప్రభుత్వం జారీ చేసిన ఈ ఉత్తర్వుల ప్రకారం, సంబంధిత శాఖలు వెంటనే ఖాళీల వివరాలు, రోస్టర్ పాయింట్లు, అర్హతలకు సంబంధించిన సమాచారాన్ని నియామక సంస్థలకు అందించాలని ఆదేశించారు. ప్రెసిడెన్షియల్ ఆర్డర్, రిజర్వేషన్ పాలసీ, సర్వీస్ రూల్స్‌ను కచ్చితంగా పాటిస్తూ నియామక ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ భారీస్థాయి నియామక ప్రకటనతో రాష్ట్రంలోని లక్షలాది మంది నిరుద్యోగ అభ్యర్థులలో కొత్త ఆశలు చిగురించాయి..

## నన్ను, నా కుటుంబాన్ని టార్గెట్ చేశారు..

హైదరాబాద్: టీపీసీసీ క్రమశిక్షణ కమిటీకి మంత్రి కొండా సురేఖ మరో లేఖ రాశారు. తనను, తన కుటుంబాన్ని కొందరు లక్ష్యంగా చేసుకున్నారన్నారు. తనను లక్ష్యంగా చేసుకొని అవమానకరంగా వ్యాఖ్యలు చేస్తున్న వారి వెనుక ఉన్న వ్యక్తుల్ని గుర్తించి చర్యలు తీసుకోవాలని క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవిని కోరారు. కమిటీ నోటీసుకు ఇప్పటికే వివరణ ఇచ్చానని, అయినా పలువురు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నేతలు బహిరంగంగా అవమానకర రీతిలో వ్యాఖ్యలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విచారణ కొనసాగుతున్న సమయంలోనే తనపై బహిరంగంగా విమర్శలు చేయడం సరికాదని, దీన్ని కమిటీ పరిశీలించాలని కోరారు.

**కుమార్తె మాటల్ని సురేఖ ఖండించాలి: మల్లు రవి**

మరోవైపు, మంత్రి సురేఖ లేఖ రాయడానికి ముందు ఈ వ్యవహారంపై టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి స్పందించారు. సురేఖ ఇచ్చిన వివరణపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. కుమార్తె వ్యాఖ్యలను ఒక మంత్రిగా ఆమె ఖండించాలని సూచించారు. సహజ న్యాయ సూత్రాల ప్రకారం తనకు సంబంధం లేదని సురేఖ చెబుతున్నారన్నారు. సురేఖ వివరణపై ఎప్పుడు చర్యలు తీసుకుంటామో చెప్పలేమన్నారు. సీఎం రేవంత్ రెడ్డిపై ఆమె కుమార్తె వ్యాఖ్యలపై కొండా సురేఖ వివరణ చూశామని తెలిపారు. "ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి మాటల వీడియో కూడా పరిశీలించాం.. ఆయన ఇచ్చిన వివరణను సైతం కమిటీ పరిశీలించింది. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి విషయంలో ప్రొసీజర్ ప్రకారం వెళ్తాం.. రాజగోపాల్ రెడ్డిపై ఎలాంటి ఫిర్యాదు రాలేదు.. వ్యాఖ్యలపై సుమోటోగా తీసుకోవాలా? లేదా?అనేది పరిశీలిస్తున్నాం" అని మల్లు రవి ఈ సాయంత్రం మీడియాకు తెలిపారు.

పెన్ పవర్
మార్కాపురం - ప్రకాశం

# మాచవరంలో ముమ్మరంగా ఇ-పంట నమోదు

**కందుకూరు పెన్ పవర్, ఆగస్టు 22**

మాచవరం గ్రామంలో ఇ-పంట నమోదు కార్యక్రమాన్ని మండల వ్యవసాయాధికారి అబ్దుల్ రహీం పర్యవేక్షించారు. గ్రామంలో సాగు చేస్తున్న సుమారు 300 ఎకరాల వరి పంటకు గాను ఇప్పటివరకు 150 ఎకరాల పంటను నమోదు చేసినట్లు తెలిపారు. మిగిలిన పంటను మరో రెండు రోజుల్లో నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు.పంటను ఇ-పంటలో నమోదు చేసుకోవడం వల్ల రైతులకు వివిధ ప్రభుత్వ పథకాలలో గుర్తింపు లభించడంతో పాటు అవసరమైన ఎరువులను పొందేందుకు అవకాశం ఉంటుందని వ్యవసాయాధికారి తెలిపారు. రైతుల అవసరాల మేరకు గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో 18 టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.రైతులు అవసరమైన యూరియాను ప్రైవేట్ వ్యాపారుల వద్ద కూడా



ఎంఆర్పీ ధరకు కొనుగోలు చేయవచ్చని రహీం తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

# మార్కాపురంలో పవర్ వార్..!

**పొదిలికి చెందిన భాస్కర్ సీఎంకు రాసిన లేఖతో మొదలైన ముసలం..**

**ఎమ్మెల్యే అండ్ మాజీ ఎమ్మెల్యే మధ్య సెమీ ఫైనల్ ఫైట్**

**మార్కాపురం నుంచి తర్లుపాడు దాకా ఇదే సీన్**

**ఆర్య వైశ్యులు ఓటు బ్యాంకుపై రెండు పార్టీల కన్ను - ఎటువైపు మొగ్గుతారో ?**

**కొత్త జిల్లాలో తొలి పరీక్ష నియోజకవర్గమంతా రగులుతున్న రాజకీయం**

*రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగింది. అయితే కొత్తగా ఏర్పడిన మార్కాపురం జిల్లాలో మాత్రం ఈ ఎన్నికలు మామూలు ఎన్నికలుగా కాకుండా, అధికార టీడీపీ, ప్రతిపక్ష వైసీపీ మధ్య పవర్ వార్ గా మారాయి. మార్కాపురం నియోజకవర్గంలో కీలకమైన పొదిలి నగర పంచాయతీ వివాదం ఒక ఉదాహరణ మాత్రమే. అసలు పోరు మాత్రం మార్కాపురం నియోజకవర్గం అంతటా మొదలైంది. మార్కాపురం మున్సిపాలిటీ నుంచి తర్లుపాడు మండల పరిషత్ దాకా,ప్రతి పంచాయతీలోనూ ఎమ్మెల్యే అండ్ మాజీ ఎమ్మెల్యే మధ్య సాగుతోంది.*






**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 22**

రాష్ట్రమంతా స్థానిక ఎన్నికల హడావుడి నడుస్తుంటే, కొత్తగా ఏర్పడిన మార్కాపురం జిల్లాలో మాత్రం పవర్ వార్ నడుస్తోంది. పొదిలి నగర పంచాయతీ చైర్మన్ పీఠం కోసం టీడీపీ నేత భాస్కర్ రాసిన లేఖతో మొదలైన ముసలం ఇప్పుడు నియోజకవర్గమంతా రగులుతోంది. ఇది కొత్త జిల్లాలో జరుగుతున్న తొలి పరీక్ష కావడంతో ఎమ్మెల్యే కందుల, మాజీ ఎమ్మెల్యే రాంబాబు మధ్య సెమీ ఫైనల్ ఫైట్‌గా మారింది. మార్కాపురం నియోజకవర్గంలో నిర్ణయాత్మకంగా ఉన్న ఆర్య వైశ్యుల ఓటు బ్యాంకుపై రెండు పార్టీలు కన్నేశాయి. శుక్రవారం పొదిలి లో అన్నా రాంబాబు ప్రెస్ మీట్ పెట్టి ఆర్యవైశ్యులకు జరుగుతున్న అన్యాయంపై టిడిపిని టార్గెట్ చేసి మాట్లాడారు.. దీనిపై టిడిపి కౌంటర్ ఎలా ఇస్తుందో వేచి చూడాల్సిందే.

**రాష్ట్రమంతా ఒకే ఎన్నిక.. మార్కాపురంలో మాత్రం సెమీ ఫైనల్..:** రాష్ట్రవ్యాప్తంగా జరుగనున్న జడ్పిటిసి, ఎంపీటీసీ,పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలను అన్ని నియోజకవర్గాల్లో సాధారణ ఎన్నికలుగానే చూస్తున్నారు. కానీ మార్కాపురం నియోజకవర్గంలో మాత్రం పరిస్థితి వేరు. కొత్త జిల్లా ఏర్పడిన తర్వాత వస్తున్న మొదటి ఎన్నికలు కావడంతో, ఇక్కడ ప్రతి చిన్న పంచాయతీ ఎన్నిక కూడా 2029 అసెంబ్లీకి సెమీ ఫైనల్ లా మారనున్నాయి. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి నియోజకవర్గంలో తన పట్టు నిరూపించుకోవాలని చూస్తుంటే, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు ఇక్కడ టీడీపీకి పట్టు లేదని నిరూపించేందుకు వ్యూహాలు పన్నుతున్నారు.

**పొదిలి ఓ శాంపిల్ మాత్రమే, నియోజకవర్గమంతా ఇదే సీన్..:** పొదిలిలో టీడీపీ నేత లేఖతో మొదలైన ఆర్యవైశ్యుల ఓటు వివాదం ఒక మచ్చుతునక మాత్రమే. ఇదే తరహా అంతర్గత కుమ్ములాట, మార్కాపురం మున్సిపాలిటీ, తర్లుపాడు, కొనకనమిట్ల మండలాల్లోని పలు పంచాయతీల్లోనూ ఉంది. టికెట్ల కోసం కూటమి నేతల మధ్య పోటీ, వైసీపీకి అస్త్రంగా మారుతోంది. పొదిలిలో ఆర్యవైశ్యుల అంశం తెరపైకి వస్తే, మార్కాపురం రూరల్ లో రెడ్డి సామాజిక వర్గ ఆధిపత్యం, తర్లుపాడులో బీసీల టికెట్ల అంశం హాట్ టాపిక్ గా మారింది.

**మార్కాపురం మున్సిపాలిటీ నుంచి తర్లుపాడు దాకా ఒకే ఫార్ములా..:** వైసీపీ ఇంచార్జ్ అన్నా రాంబాబు అవలంబిస్తున్న ఫార్ములా ఒక్క పొదిలికే పరిమితం కాలేదు. నియోజకవర్గ వ్యాప్తంగా అధికార పార్టీ నేతల అక్రమాలను, విశ్వనాథపురం సొసైటీ భూముల అక్రమ రిజిస్ట్రేషన్లు, పొదిలి వ్యాపారిపై దాడి చేసిన ఎస్సైకి జిల్లా కేంద్రంలో పోస్టింగ్ వంటి ప్రతి అంశాలను ప్రస్తావిస్తున్నారు. అధికారంలో ఉండి కూడా ప్రజలకు న్యాయం చేయలేని వారు, పదవుల కోసం లేఖలు రాసుకోవడం సిగ్గుచేటు అంటూ మీడియా ముఖంగా శుక్రవారం అన్నా రాంబాబు ఫైర్ అయ్యాడు.

**కొత్త జిల్లాలో పట్టు కోసం ఇద్దరి వ్యూహం..**

కొత్త జిల్లా మార్కాపురం నియోజకవర్గంలో ఎంపీపీలు, పంచాయతీ సర్పంచులు, మున్సిపల్ చైర్మన్లు ఎవరు అనేది ఈ స్థానిక ఎన్నికలే డిసైడ్ చేస్తాయి. అందుకే ఎమ్మెల్యే కందుల వర్గం నియోజకవర్గంలోని అన్ని మండలాలలోని పంచాయతీలు, మార్కాపురం మున్సిపాలిటీని ఎలాగైనా నిలబెట్టుకోవాలని చూస్తోంది. మరోవైపు అన్నా రాంబాబు మాత్రం అన్ని మండలాల్లోని పంచాయతీలను టార్గెట్ చేసి, గ్రామ స్థాయి నుంచి కూటమికి షాక్ ఇవ్వాలని ప్లాన్ చేస్తున్నారు. దీంతో నియోజకవర్గమంతా రెండు వర్గాల క్యాంప్ లతో హోరెక్కనుంది.

**రాష్ట్ర ఎన్నికల్లో మార్కాపురం హాట్ స్పాట్..**

రాష్ట్రవ్యాప్తంగా స్థానిక ఎన్నికలు జరగబోతున్న మార్కాపురం నియోజకవర్గం మాత్రం రాష్ట్రస్థాయిలో హాట్ స్పాట్ గా మారింది. నియోజకవర్గం రాజకీయాలపై రాష్ట్ర నాయకత్వం కూడా దృష్టి పెట్టింది. పొదిలి లేఖ వివాదం రాష్ట్రస్థాయిలో చర్చకు రావడంతో, ఈ నియోజకవర్గంలో అటు టీడీపీ అధిష్టానం, ఇటు వైసీపీ అధిష్టానం కూడా తలలు పట్టుకుంటున్నాయి.

# వెలిగొండ నిర్వాసితులకు మరో రూ.250 కోట్ల పరిహారం

**నిర్వాసితులకు చెక్ అందజేసిన సీఎం చంద్రబాబు**





**అమరావతి పెన్ పవర్ ఆగస్టు 22**

వెలిగొండ ప్రాజెక్టు కోసం తమ భూములు, ఇళ్లు కోల్పోయి త్యాగాలు చేసిన నిర్వాసిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం మరో శుభవార్త అందించింది. ఉండవల్లిలోని తన నివాసంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం వెలిగొండ నిర్వాసిత కుటుంబాలకు రూ.250 కోట్ల పరిహారపు చెక్కును అందజేశారు.ఇప్పటివరకు వెలిగొండ నిర్వాసితులకు ప్రభుత్వం మొత్తం రూ.768 కోట్ల పరిహారం అందించినట్లు సీఎం ఈ సందర్భంగా తెలిపారు. నిర్వాసితుల త్యాగాలను ప్రభుత్వం ఎప్పటికీ మరువదని, వారికి న్యాయం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యేలు కందుల నారాయణ రెడ్డి, ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి, ముత్తుమల అశోక్ రెడ్డి, ఎర్రగొండపాలెం టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఏరిక్షన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ శాఖ ఏ.ఈ పరీక్షలకు సర్వం సిద్ధం

**దళారులను నమ్మవద్దు.. అత్యంత పారదర్శకంగా నియామకాలు**

**ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు: మంత్రి గొట్టిపాటి. రవికుమార్**

**అమరావతి/అద్దంకి, ఆర్.సి (పెన్ పవర్) ఆగస్టు 22:**



రాష్ట్రంలోని వివిధ విద్యుత్ రంగ సంస్థల్లో సహాయక ఇంజినీర్ (ఏఈ) ఉద్యోగాల నియామక పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మొత్తం 629 పోస్టుల భర్తీకి గాను లక్ష మందికి పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని వెల్లడించారు. ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా ఆదివారం నిర్వహించనున్న ఈ పరీక్షను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

**ప్రలోభాలకు లొంగవద్దు..:** ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ వచ్చే దళారుల చెప్పుడు మాటలు, ప్రలోభాలను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని అభ్యర్థులకు మంత్రి సూచించారు. నియామకాల పేరుతో నిరుద్యోగులను మోసగించాలని చూస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా ప్రలోభపెట్టే ప్రయత్నం చేస్తే అభ్యర్థులు భయపడకుండా నేరుగా ప్రభుత్వానికే ఫిర్యాదు చేయవచ్చని ఆయన స్పష్టం చేశారు. ఖాళీల భర్తీ ద్వారా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, విద్యుత్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి ప్రధాన లక్ష్యమని మంత్రి వివరించారు. నూతనంగా ఎంపికయ్యే 629 మంది అధికారుల ద్వారా ప్రజలకు విద్యుత్ రంగంలో మరింత మెరుగైన సేవలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు నిరుద్యోగులకు ఇచ్చిన మాట ప్రకారం ఉద్యోగాల భర్తీకి చిత్తశుద్ధితో కృషి చేస్తోందని మంత్రి రవికుమార్ ఉద్ఘాటించారు.

# పరిశుభ్రత ఆత్మగౌరవ ప్రతీక

**- జిల్లా కలెక్టర్ రాజాబాబు**







**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 22**

పరిశుభ్రతతోనే గౌరవం, ప్రత్యేక గుర్తింపు లభిస్తాయని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. ‘ స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర ‘ కార్యక్రమంలో భాగంగా శనివారం చీమకుర్తి మండలంలోని ఆర్.ఎల్. పురం గ్రామంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బి.ఎన్. విజయ్ కుమార్ తో కలిసి ఆయన పాల్గొన్నారు. పారిశుద్ధ్య కార్మికులతో కలిసి డ్రైనేజీలలో పూడికతీత పనులలో వారు పాల్గొని పరిశుభ్రత విషయంలో స్థానికులలో చైతన్యం నింపారు. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన అవసరాన్ని తెలిపేలా గ్రామంలో మొక్కలు నాటారు. స్థానికంగా ఉన్న ‘ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రా’న్ని కూడా వారు పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ... పరిశుభ్రత అనేది ఆత్మగౌరవానికి ప్రతీక అన్నారు. ముఖ్యంగా మైనింగ్, పరిశ్రమలు ఉన్న ప్రాంతంలో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఈ గ్రామంలో అవసరమైన ఇతర మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తెస్తామన్నారు. డస్ట్ పొల్యూషన్ లేకుండా అవసరమైన అన్ని రోడ్లను తక్షణమే నిర్మించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూడా ప్రతి నెలా మూడో శనివారం ఒక్కో జిల్లాలో పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు. జిల్లా యంత్రాంగం కూడా అదే స్ఫూర్తితో పని చేస్తున్నట్లు చెప్పారు. ఎం.ఎల్.ఏ. విజయ్ కుమార్ మాట్లాడుతూ.. ఆరోగ్యానికి పరిశుభ్రతే ప్రధానం అన్నారు. అందుకే ప్రజలను భాగస్వాములను చేస్తూ ప్రభుత్వం ‘ స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర ‘ కార్యక్రమాన్ని ప్రతినెలా వివిధ ఇతివృత్తాలతో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం చేస్తున్న ఈ కార్యక్రమాల్లో ప్రజలు కూడా భాగస్వాములై పరిశుభ్ర సమాజ ఆవిష్కరణలో తమ వంతు బాధ్యత నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. పారిశుద్ధ్య విధులలో చిత్తశుద్ధితో పనిచేస్తున్న నలుగురు పారిశుధ్య కార్మికులకు ఈ కార్యక్రమంలో కలెక్టర్, ఎమ్మెల్యే, ఇతర అధికారుల చేతుల మీదగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో చిరంజీవి, డిపిఓ అనుపమ, ఆర్డిఓ చంద్రశేఖర్ నాయుడు, డి.ఎల్.పి.ఓ. పద్మ, ఎంపీడీవో రాఘవేంద్ర, తహసిల్దార్ బ్రహ్మయ్య, ఇతర అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# స్థానిక పోరుకు సిద్ధమవుతున్న రాజకీయ పార్టీలు

**బరిలో దిగేందుకు ఆశావాహుల ఆసక్తి -స్థానిక ఎన్నికలపై గ్రామాల్లో జోరుగా చర్చలు**

**సి.ఎస్.పురం,పెన్ పవర్ ఆగస్టు 22**



రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సిద్ధమవుతున్న నేపథ్యంలో మండలంలోని పలు గ్రామపంచాయతీల్లో రాజకీయ సందడి మొదలైంది. ఎన్నికలకు ఇంకా అధికారిక షెడ్యూల్ వెలువడాల్సి ఉన్నప్పటికీ ఆయా పార్టీలకు చెందిన ఆశావహులు ఇప్పటి నుంచే గ్రామాల్లో తమ అనుచరులు, ముఖ్య నాయకులతో మంతనాలు సాగిస్తుండటంతో రాజకీయ వాతావరణం క్రమంగా వేడెక్కుతోంది. మండలంలోని పలు గ్రామపంచాయతీల్లో టీడీపీ, వైసీపీ, జనసేన, బీజేపీ పార్టీల నుంచి పోటీ చేసేందుకు పలువురు నాయకులు ఆసక్తి చూపుతున్నట్లు చర్చ సాగుతోంది. ఎంపీటీసీ సర్పంచ్ పదవుల స్థానాలకు పోటీ చేయాలనుకునే ఆశావహులు తమకు అనుకూలంగా ఉన్న పరిస్థితులను అంచనా వేసుకుంటూ గ్రామాల్లో పరిచయాలు పెంచుకునే పనిలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది.

**గ్రామాల్లో జోరుగా చర్చలు..:** ఎన్నికలపై అధికారిక ప్రకటన వెలువడకముందే గ్రామాల్లో ఎక్కడ చూసినా స్థానిక రాజకీయాలపైనే చర్చ జరుగుతోంది. ఎవరు పోటీ చేస్తారు? ఏ పార్టీ తరపున బరిలోకి దిగుతారు? ఎవరికి ప్రజాదరణ ఉంది? ఏ అభ్యర్థికి గెలుపు అవకాశాలు మెరుగ్గా ఉన్నాయి అనే అంశాలపై గ్రామాల్లో ప్రజలు చర్చించుకుంటున్నారు. కొన్నిచోట్ల నాయకులు, కార్యకర్తలు అనధికారికంగా సమావేశమై ఎన్నికల పరిస్థితులపై చర్చిస్తున్నట్లు సమాచారం

**అధిష్టానం ఆదేశిస్తే బరిలోకి..:** కొంతమంది రాజకీయ నాయకులు తమ పార్టీ మద్దతు తెలిస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెబుతున్నారు ఇప్పటికే కొందరు ఆశావాహులు తమకు ప్రజల మద్దతు ఉందంటూ అనుసుల వద్ద ధీమా వ్యక్తం చేస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది మరోవైపు పార్టీ నాయకత్వం ఎవరిని బరిలోకి దింపుతుందని అంశంపై ప్రజల్లో పార్టీల్లో ఆసక్తి నెలకొంది

**కూటమి వర్సెస్ వైసిపి..:** స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి మద్దతుతో పోటీ చేసే అభ్యర్థులదే విజయమని టిడిపి శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలే తమకు ప్రధాన బలమని ఆ పార్టీ నాయకులు అంటున్నారు గ్రామస్థాయిలో టిడిపి జనసేన బిజెపి శ్రేణుల సమన్వయంతో స్థానిక ఎన్నికలను ఎదుర్కొంటామని ధీమా వ్యక్తం చేస్తున్నారు వైసీపీ శ్రేణులు కూడా ఎన్నికల బరిలో తమ మద్దతుదారులు పోటీలో ఉంటామని గెలుపు మాదేనని ధీమా వ్యక్తం చేస్తున్నారు ఇదిలా ఉండగా ప్రధాన పార్టీలలో అభ్యర్థుల ఎంపిక అంశం కీలకంగా మారనుంది ఒకే పదవికి పలువురు ఆశావహులు ముందుకు వస్తే పార్టీ నాయకత్వాలు ఎవరికి అవకాశం కల్పిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది అధికారిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత రాజకీయ సమీకరణలు మరింత వేగంగా మారే అవకాశం ఉందని పలువురు చర్చించుకుంటున్నారు ప్రస్తుతం ఎన్నికల తేదీలపై స్పష్టత లేకపోయినా గ్రామాల్లో మాత్రం ఎన్నికల వాతావరణం కనిపిస్తుంది రానున్న రోజుల్లో వివిధ రాజకీయ కార్యకర్తల సమావేశాలు అభ్యర్థుల ఎంపిక వంటి అంశాలతో మండలంలోని రాజకీయ వేడి మరింత పెరిగే అవకాశం ఉందని పలువురు భావిస్తున్నారు పంచాయతీలలో జరుగుతున్న రాజకీయ పరిణామాలు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఊహగానాలేనా అన్నది కాలమే నిర్ణయిస్తుంది.

# మియావాకి వనంలో 500 మొక్కలు నాటిన కళాశాల విద్యార్థులు

## -పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత - మున్సిపల్ కమిషనర్ కొర్రపాటి అనూష





**కందుకూరు పెన్ పవర్, ఆగస్టు 22**

కందుకూరులోని టిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో స్కందపురి సేవా సమితి, కళాశాల వృక్షశాస్త్ర విభాగం, ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో మియావాకి వనంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఎస్‌బీఐ కందుకూరు రీజినల్ ఆఫీస్ అందించిన 500 మొక్కలను మియావాకి వనంలో రెండో దశలో భాగంగా నాటారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె. శ్రీనివాసులు మాట్లాడుతూ మొక్కలు అందించిన ఎస్‌బీఐ అధికారులకు, స్కందపురి సేవా సమితి చైర్మన్ పువ్వాడి మౌనికకు కృతజ్ఞతలు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, విద్యార్థినీ విద్యార్థులు మరింత చొరవ తీసుకుని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు కాలుష్యాన్ని తగ్గించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మున్సిపల్ కమిషనర్ కొర్రపాటి అనూష మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. టి.ఆర్.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, స్కందపురి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మియావాకి వనం కాలుష్య నియంత్రణకు, పర్యావరణ సమతుల్యత పరిరక్షణకు ఎంతో దోహదపడుతుందని తెలిపారు. స్కందపురి సేవా సమితి చైర్మన్ పువ్వాడి మౌనిక మాట్లాడుతూ మియావాకి వనం ఏర్పాటుకు సహకరించిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ కె. అనూషతో పాటు పుర ప్రముఖులు, సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. వాతావరణ మార్పులు, ఎల్‌నినో వంటి పరిస్థితులను ఎదుర్కొంటున్న ప్రస్తుత తరుణంలో మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించి పెంచడం కూడా ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వృక్షశాస్త్ర అధ్యాపకులు రాజశేఖర్, డాక్టర్ ఎన్. తిరుపతి స్వామి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు కె. నరేష్ రాజా, డాక్టర్ కె.వి. పద్మావతి, అధ్యాపకులు డాక్టర్ ఎన్.వి. శ్రీహరి, డాక్టర్ పి. రాజగోపాల్ తదితర అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# శివారు ప్రాంతాల్లోని పేదలకు షైన్ ఫౌండేషన్ అండ

## -నిరుపేదలను ఆదుకోవడమే ప్రధాన లక్ష్యం: రహీమ్



**కందుకూరు పెన్ పవర్,ఆగస్టు 22**

కందుకూరు పట్టణ శివారు ప్రాంతాల్లో నివసిస్తున్న నిరుపేదలకు షైన్ ఫౌండేషన్ అండగా నిలిచింది. శివారు ప్రాంతాల్లోని పేదలు దుస్తులు లేక ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న ఫౌండేషన్ ప్రతినిధులు స్పందించి, ఇళ్ల నుంచి సేకరించిన దుస్తులను వారికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు రహీమ్ మాట్లాడుతూ షైన్ ఫౌండేషన్ అందరిదని, గత ఆరు సంవత్సరాలుగా పేదలకు బియ్యం, కూరగాయలు, ఆహారం, దుస్తులు తదితరాలను అందిస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నిరుపేదలను ఆదుకోవడమే ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమన్నారు. భవిష్యత్తులో కూడా అందరి సహకారంతో పేదలకు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి, అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామని రహీమ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు నయీమ్ భాష, కరిముల్లా, మహబూబ్ బాషా, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఎయిడ్స్ పై అవగాహన




**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 22**

గిద్దలూరు లోని సెయింట్ పాల్ ఎయిడెడ్ రైల్వే కాలనీ హై స్కూల్ నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు ఇంటెన్సిఫైడ్ ఐఇసి క్యాంపెయిన్ భాగంలో హాండ్స్ ఆఫ్ కంపాక్షన్ లెడ్ దిశ ఈ సదస్సులో హెచ్ఐవి అనగానేమి అది ఎలా వ్యాప్తి చెందుతుంది హెచ్ఐవి రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి హెచ్ఐవి ఎయిడ్స్ సంబంధించిన అపోహాలు లక్షణాల వంటి అంశాలపై అవగాహన కల్పించడం అదేవిధంగా యువత డ్రగ్స్ కు బానిసలు కాకుండా జాగ్రత్తగా ఉండాలని ఈ వ్యాధికి చికిత్స లేదు నివారణ ఒక్కటే మార్గం. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చిన్నచూపు లేకుండా సమాజంలో ఎలా కలిసి జీవించాలో తెలియజేయడం సుఖ వ్యాధుల గురించి అవగాహన కల్పించడం హెచ్ఐవి ఎయిడ్స్ ఆక్ట్ 2017 గురించి చెప్పడం ఈ కార్యక్రమంలో హెచ్ఎం తిమోతి ప్రసాద్ , సురేష్ రెడ్డి సునీత ,హెచ్ ఓ సి సిబ్బంది ఓ ఆర్ డబ్ల్యు దుర్గ భవాని రిప్కా సునీత శైలజ తదితరులు పాల్గొన్నారు.

# రెండో విడత జ్ఞానజ్యోతి శిక్షణ - సిడిపిఓ సుధా



**సంతమాగులూరు, పెన్ పవర్, ఆగస్టు 22**

సంతమాగులూరు మండలంలో సీడీపీఓ సుధా ఆధ్వర్యంలో జ్ఞానజ్యోతి రెండో విడత శిక్షణ కార్యక్రమం శుక్రవారం తిరిగి ప్రారంభమైంది. ఈ శిక్షణలో భాగంగా సమ్మిళిత విద్యపై సూపర్‌వైజర్ ప్రమీల, ఆరోగ్యం--పౌష్టికాహారంపై సూపర్‌వైజర్ సుష్మా అంగన్‌వాడీ టీచర్లకు వివరించారు. గత విడత శిక్షణలో నేర్చుకున్న అంశాలను సైతం ఈ సందర్భంగా పునశ్చరణ చేశారు. కార్యక్రమంలో మండలంలోని 70 మంది అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు. ఈ శిక్షణ ఆగస్టు 24, 25 తేదీల వరకు కొనసాగనుంది. ప్రీస్కూల్ విద్యా విధానంపై మరిన్ని మెలకువలు, పిల్లలకు సమర్థవంతంగా బోధించేందుకు అవసరమైన సూచనలు, బోధనా పద్ధతులపై శిక్షణ ఇవ్వనున్నారు. తద్వారా ప్రీస్కూల్ విద్య మరింత బలోపేతం కానుంది. అనంతరం స్వర్ణ ఆంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ టీచర్లతో ప్రతిజ్ఞ చేయించారు.

# నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

## - ఒంగోలు డిఇఈ కె వి పాండురంగా రావు

**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 22**

విద్యుత్ మరమ్మత్తు పనుల కారణంగా ఆదివారం ఒంగోలులోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా కు అంతరాయం ఉంటుందని ఒంగోలు టౌన్ విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె వి పాండురంగా రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు 60 అడుగుల రోడ్డు, బాలకృష్ణాపురం, యాదవ బజార్ 1వ లైన్, 2వ లైన్, ఆర్టీసీ కాలనీ, సత్యనారాయణపురం, చంద్రయ్య నగర్, అయ్యన్న వీధి, ఎన్జీఓ కాలనీ, కర్నూలు రోడ్, పాత మార్కెట్, బాపుజీ మార్కెట్, ఇస్లాం పేట, గోపాల్ నగర్ ఏరియాలలో అదే విధంగా భాగ్యనగర్ 2 వ లైన్, దారావారితోట పరిసర ప్రాంతంలో ఉదయం 06.00 గం. నుండి 08.30 గం. వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డిఈఈ తెలియజేశారు. కావున విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

# ప్రయోగశాల నుంచి మార్కెట్ దిశగా అటల్ ఎఫ్‌డీపీ విజయవంతం







**కందుకూరు పెన్ పవర్, ఆగస్టు 22**

ప్రయోగశాలల్లో రూపుదిద్దుకునే పరిశోధనలను సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు, స్టార్టప్‌లుగా మలిచే దిశగా అధ్యాపకులకు కొత్త ఆలోచనలకు మార్గం చూపిన ఏఐసీటీఈ--అటల్ జాతీయ అధ్యాపక శిక్షణా కార్యక్రమం ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఘనంగా ముగిసింది. కళాశాల ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో ఏఐసీటీఈ--అటల్ అకాడమీ ప్రాయోజకత్వంలో "ప్రయోగశాల నుంచి మార్కెట్ వరకు సాంకేతిక పారిశ్రామికవేత్తల అభివృద్ధి" అంశంపై ఆరు రోజులపాటు నిర్వహించిన ఈ జాతీయ శిక్షణా కార్యక్రమంలో దేశంలోని ప్రముఖ నిపుణులు పరిశోధన, మేధోసంపత్తి హక్కులు, స్టార్టప్‌లు, సాంకేతిక వాణిజ్యీకరణ తదితర అంశాలపై అధ్యాపకులకు అవగాహన కల్పించారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కె. విజయ శ్రీనివాస్ తన సందేశంలో, ఇలాంటి జాతీయ స్థాయి కార్యక్రమాలు పరిశోధన సంస్కృతిని బలోపేతం చేసి విద్యా సంస్థలను ఆవిష్కరణల కేంద్రాలుగా తీర్చిదిద్దుతాయని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సి.హెచ్. రవికుమార్ అధ్యాపకుల నైపుణ్యాభివృద్ధికి, పరిశోధన నాణ్యత పెంపునకు ఇటువంటి శిక్షణలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. ముగింపు కార్యక్రమంలో వివిధ కళాశాల నుంచి పాల్గొన్న అధ్యాపకులు, పరిశోధకులతో పాటు ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులకు శిక్షణా పూర్తి ధ్రువపత్రాలను అందజేశారు. ఈ ఎఫ్‌డీపీ ద్వారా పరిశోధనను ఆచరణాత్మక ఆవిష్కరణలుగా మలిచే అంశాలపై విలువైన అవగాహన లభించిందని ఇతర కళాశాలల అధ్యాపకులు హర్షం వ్యక్తం చేస్తూ నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల అన్ని విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతానికి సైనికుల్లా కృషి చేయాలి

## నూతన పదవులు పొందిన నేతలకు దిశానిర్దేశం.

## ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలి: డాక్టర్. అశోక్ కుమార్.






**అద్దంకి, ఆర్.సి(పెన్ పవర్) ఆగస్టు 22**

అద్దంకి నియోజకవర్గంలో నూతనంగా పదవులు పొందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తమపై నమ్మకంతో పార్టీలో కీలక బాధ్యతలు అప్పగించినందుకు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపి, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ అశోక్ కుమార్ నూతనంగా పదవులు చేపట్టిన నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ సిద్ధాంతాలను, ఆశయాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. పదవులు కేవలం అలంకారప్రాయం కాదని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం రాజీలేని పోరాటం చేయాలని దిశానిర్దేశం చేశారు. అందరూ సమన్వయంతో శాయశక్తులా కృషి చేసి పార్టీకి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంతమాగులూరు, బల్లికురవ మండలాల పార్టీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు పాల్గొన్నారు. వారితో పాటు రాష్ట్ర యువజన విభాగం నేతలు, జిల్లా స్థాయి నాయకులు, వివిధ హోదాల్లో ఉన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

# రీ సర్వే ప్రక్రియను గడువు లోగా పూర్తి చేయాలి

## - జిల్లా కలెక్టర్ రాజాబాబు ఆదేశం



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 22**

రీ సర్వే ప్రక్రియను నిర్దేశించిన గడువులోగా అధికారులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశించారు. రెవెన్యూ అంశాలపై శనివారం స్థానిక కలెక్టరేట్ లో ఆయన సమావేశం నిర్వహించారు. రీ సర్వే ప్రక్రియ దశలవారీగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ చెప్పారు. 494 గ్రామాలలో రీ సర్వే చేయాల్సి ఉందన్నారు. 290 గ్రామాలలోని 4 లక్షల ఎకరాలలో రీ సర్వే సమర్థంగా, పూర్తిస్థాయిలో ముగించామన్నారు. వివిధ సాంకేతిక కారణాలతో ఐదవ విడతలో 5 గ్రామాలు పెండింగ్ లో ఉన్నాయన్నారు. ఆరో విడతలో 36 గ్రామాలలో రీ సర్వే ప్రక్రియ జరుగుతోందన్నారు. కొన్ని గ్రామాలలో రీ సర్వే పూర్తి చేసినప్పటికీ వారికి పాస్ పుస్తకాలు జారీ చేయలేక పోయామన్నారు. ఎదురవుతున్న సాంకేతిక కారణాలపై నివేదిక సిద్ధం చేయాలని ఆయన ఆదేశించారు. రీ సర్వే జరగకపోవడానికి ఎదురైన కారణాలపై స్పష్టమైన నివేదిక సమర్పించాలన్నారు. రీ సర్వే ప్రక్రియపై నమోదైన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే పరిష్కార మార్గం చూపాలని కలెక్టర్ తెలిపారు. 13,267 అర్జీలు రీ సర్వేపై నమోదు కాగా అత్యధిక భాగం పరిష్కరించామన్నారు. క్షేత్రస్థాయిలో నమోదైన అర్జీల పరిష్కారంలో నాణ్యత లోపించడంతో 337 అర్జీలు పునరావృతం అయ్యాయన్నారు. ప్రజల నుంచి సంతృప్తి స్థాయి పెరగాలన్నారు. లబ్ధిదారులందరికీ పాస్ పుస్తకాలు అందజేయాలన్నారు. సాధారణ ' మీకోసం'లో నమోదవుతున్న అర్జీల పరిష్కారంపై సమగ్ర నివేదిక ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పునరావృతం అవుతున్న అర్జీలపై మండలాల వారీగా నివేదిక ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ వెంకటరమణ, ఒంగోలు ఆర్.డి.ఓ. టి.చంద్రశేఖర్ నాయుడు, సర్వే ల్యాండ్స్ రికార్డ్స్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పొదిలిలో మానవత సంస్థ శాంతి ప్రదర్శన



**పొదిలి, పెన్ పవర్, ఆగస్టు 22**

పొదిలిలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శాంతి ప్రదర్శన జరిగింది. ఆ సంస్థ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం నాడు అట్టహాసంగా ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో పాల్గొన్న పొదిలి మునిసిపల్ కమిషనర్ రామ్మోహనరావు మాట్లాడుతూ పొదిలి మానవతా సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా అధ్యక్షులు మువ్వల పార్థసారథి మాట్లాడుతూ ప్రపంచ శాంతి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో మానవతా సంస్థ మాజీ జిల్లా అధ్యక్షులు కే ఎల్లమందరెడ్డి, చైర్మన్ కాటూరి వెంకటనారాయణ బాబు, మండల శాఖ అధ్యక్షులు సోమిశెట్టి చిరంజీవి, కార్యదర్శి సిహెచ్ వెంకటకృష్ణా రావు, ఉపాధ్యక్షుడు భూమా సుమంత్, కోశాధికారి బండి అశోక్, జిల్లా పరిశీలికులు కే శ్రీనివాసరెడ్డి, దాసరి గురుస్వామి, మోహనకృష్ణ, ఎం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# భక్తులకు అన్నప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన రాయళ్ళ కుటుంబం



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 22**

వరికుంటపాడు గ్రామం లోని వైకుంఠపురం లో కొలువై ఉన్న పద్మావతి గోదాదేవి సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో కోవిలంపాడు గ్రామానికి చెందిన రాయళ్ల నారాయణ ధర్మపత్ని మల్లేశ్వరి, కుమారుడు దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్వామివారి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు దాతల కుటుంబ సభ్యులు అన్నప్రసాదాన్ని సిద్ధం చేసి భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డిస్తూ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వామివారి దర్శనంతో పాటు అన్నప్రసాదాన్ని స్వీకరించిన భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. దేవస్థానానికి వచ్చే భక్తులకు తమ వంతుగా సేవ చేయాలనే ఉద్దేశంతో అన్నప్రసాద వితరణ చేపట్టినట్లు దాతలు తెలిపారు. ఈ సందర్భంగా దేవస్థానం నిర్వాహకులు రాయళ్ల నారాయణ కుటుంబ సభ్యులను అభినందించారు. అనంతరం వెంకటేశ్వర స్వామి, పద్మావతి అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేసి దేవస్థానం తరఫున శేషవస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. దేవాలయాల్లో అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా భక్తి భావంతో పాటు సేవా స్ఫూర్తి పెంపొందుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవస్థాన సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# మార్కాపురంలో నేడు బలిజల ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలి

**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 22**

ది గ్రేటర్ రాయలసీమ మహా బలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నేడు మార్కాపురంలోని ఎస్వీకేపీ కళాశాల సమీపంలోని సౌజన్య ఫంక్షన్ హాల్లో నిర్వహించనున్న బలిజల ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని మండల కాపు సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బలిజ సామాజిక వర్గం అభివృద్ధి, సంక్షేమం, భవిష్యత్ కార్యాచరణపై సమావేశంలో విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు. బలిజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలు, విద్య, ఉపాధి, సామాజికంగా మరింత అభివృద్ధి సాధించేందుకు అవసరమైన అంశాలపై నాయకులు తమ అభిప్రాయాలను వెల్లడించనున్నట్లు పేర్కొన్నారు. ఆత్మీయ సమావేశానికి ది గ్రేటర్ రాయలసీమ మహా బలిజ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మిద్దె శాంతి రాముడు, కాపు కార్పొరేషన్ మాజీ రాష్ట్ర డైరెక్టర్ పసుపులేటి వెంకటేశ్వర్లు, వివిధ ప్రాంతాలకు చెందిన బలిజ నాయకులు హాజరై తమ సందేశాలను అందించనున్నట్లు తెలిపారు. మండలంలోని బలిజ సంఘం నాయకులు, యువత, పెద్దలు, సంఘ సభ్యులు అధిక సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# విపత్తు వేళ ప్రేక్షకులుగా కాదు... రక్షకులుగా ప్రకాశం ఇంజినీరింగ్ విద్యార్థులు





**కందుకూరు పెన్ పవర్, ఆగస్టు 22**

విపత్తు సమయంలో ప్రాణాలను కాపాడే సేవా స్ఫూర్తితో కూడిన యువతను తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విభాగాల ఆధ్వర్యంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్-- ఆంధ్రప్రదేశ్, జాతీయ విపత్తు స్పందన దళం సంయుక్తంగా "యువ ఆపద మిత్ర" కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర కో-ఆర్డినేటర్ వి. హరి, జిల్లా స్కౌట్ కో-ఆర్డినేటర్ కే.వి. శేషారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎన్‌డీఆర్ఎఫ్ బృందం విపత్తులు, అగ్నిప్రమాదాలు, రోడ్డు ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రథమ చికిత్స, సహాయక చర్యలపై ప్రత్యక్ష ప్రదర్శనలతో విద్యార్థులకు శిక్షణ ఇచ్చింది. అనంతరం ఆసక్తి గల విద్యార్థులను భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ భారత్ పోర్టల్ ద్వారా సభ్యులుగా నమోదు చేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ డా. కె. విజయ శ్రీనివాస్ మాట్లాడుతూ, "దేశానికి అవసరమైనప్పుడు ముందుకు వచ్చే యువతే భారతదేశానికి నిజమైన బలం. విద్యతో పాటు సేవాభావం, క్రమశిక్షణ, మానవత్వాన్ని అలవర్చుకున్నప్పుడే విద్యార్థి సంపూర్ణ పౌరుడిగా ఎదుగుతాడు" అని అన్నారు. ఆర్ అండ్ డీ డీన్ డా. ముప్పా లక్ష్మణరావు మాట్లాడుతూ, "సమాజానికి ఉపయోగపడే ఒక్క సేవ... ఎన్నో పాఠాల కంటే గొప్పది. విపత్తు సమయంలో స్పందించే ధైర్యం, నాయకత్వం ప్రతి విద్యార్థిలో పెంపొందాలి" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో అకాడమిక్ ఇన్‌చార్జ్ ఎస్.ఎన్. మీరావలి, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ పాకల ఏడుకొండలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. సాంకేతిక విద్యతో పాటు సేవా స్ఫూర్తిని పెంపొందిస్తూ, "యువ ఆపద మిత్ర" వంటి కార్యక్రమాల ద్వారా సమాజానికి అవసరమైనప్పుడు ముందుండే బాధ్యతాయుత ఇంజినీర్లను తీర్చిదిద్దడమే ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల లక్ష్యమని ఈ కార్యక్రమం మరోసారి చాటిచెప్పింది.

## కోరం లేక మండల సర్వసభ్య సమావేశం వాయిదా




**వలేటివారిపాలెం, పెన్ పవర్ ఆగస్టు 22**

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించ తలపెట్టిన సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. ఎంపీపీ మౌనిక అధ్యక్షతన సమావేశం నిర్వహించాల్సి ఉండగా, సభ్యులు హాజరు కాకపోవడంతో కోరం లేకుండా పోయింది. దీంతో అధికారులు ఈ సమావేశాన్ని ఆదివారానికి (నేడు )వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. నిబంధనల ప్రకారం మొత్తం సభ్యులలో సగం మంది హాజరు కాకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేయాల్సి వచ్చిందని ఎంపీడీఓ వై. శంకరరావు తెలిపారు. ఆదివారం(నేడు) తిరిగి 2:30 సమావేశం నిర్వహిస్తామని, సభ్యులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

## జీవో నెం:1241 అమలు చేయాలి

### మాజీ సైనికులకు 175 గజాల స్థలం ఇవ్వాలి



**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 22**

మార్కాపురం పట్టణంలోని మాజీ సైనికులకు ప్రభుత్వం జీవో నెంబర్. 1241 / 2008 ప్రకారం 175 గజాల చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించాలని జై జవాన్ ఎక్స్ సర్వీస్ మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు అసోసియేషన్ ప్రెసిడెంట్ బుధవారం సంబంధిత అధికారులకు వినతిపత్రం అందజేశారు. తర్లపాడు రోడ్డులోని సైనికుల స్థూపం వద్ద మూడో రోజు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్మీ, బిఎస్ఎఫ్, సిఆర్ పి ఎఫ్ విభాగాల్లో దేశ సేవ చేసి రిటైర్ అయిన మాజీ సైనికులు చాలా మంది మార్కాపురంలో సొంత స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం ఇచ్చిన జీవో 1241 ప్రకారం తమకు న్యాయం చేయాలని పేర్కొన్నారు. తమ సమస్యను కలెక్టర్, ఆర్డీవో, తహసిల్దార్ లు పరిష్కరించాలని కోరారు ఈ కార్యక్రమంలో జై జవాన్ అసోసియేషన్ అధ్యక్షులు హరి నారాయణ రెడ్డి, మాజీ సైనికులు పాల్గొన్నారు.

## పొదిలి మునిసిపల్ కార్యాలయంలో ముమ్మరంగా ఓటర్ల విచారణ

**పొదిలి, పెన్ పవర్, ఆగస్టు 22**

పొదిలి మున్సిపల్ కార్యాలయంలో ముమ్మరంగా ఓటర్ల విచారణ జరుగుతోంది. అందులో భాగంగా శనివారం నాడు కార్యాలయంలో మునిసిపల్ కమిషనర్ రామ్మోహనరావు క్షేత్రస్థాయిలో ఓటర్ల విచారణను పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ఉండాలనే లక్ష్యంతో క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని కమిషనర్ రామ్మోహనరావు చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు షేక్ రసూల్ మహమ్మద్, షేక్ ఖాదర్ భాష, ముల్లా మదర్ వలి తదితరులు పాల్గొని సిబ్బందికి పలు సూచనలు చేశారు.



## రండి.. ఉచిత వైద్య సేవలు అందుకోండి.!

### యశస్విని మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నందు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు.








**పెన్ పవర్ ,కంభం ఆగస్టు 22**

రండి.. ఉచిత వైద్య సేవలు అందుకోండి. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు వైద్య సేవలు అందించడం లక్ష్యంగా నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరమును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యశాల డాక్టర్ షర్మిల డైరెక్టర్ దండు విద్యాసాగర్ తెలిపారు. ఈనెల 23న ఆదివారం కంభం బస్టాండు సమీపం లోని యశస్విని మల్టీస్పెషాల్టి హాస్పిటల్ నందు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ వైద్య శిబిరమునకు డాక్టర్ రంగారావు తనయుడు డాక్టర్ బి విరంచి యాదవ్ ఎంఎస్ మరియు డాక్టర్ నారు రమణారెడ్డి డాక్టర్ జోష్ణ ప్రత్యూష డాక్టర్ ప్రమోద్ కుమార్ రానున్నట్లు వారు తెలిపారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు డాక్టర్లు అందుబాటులో ఉంటారన్నారు. ఈ వైద్య శిబిరంలో వివిధ విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు పాల్గొంటున్నారని ప్రజలకు ఇది మంచి అవకాశం అని ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరీక్షలు అవసరమైన చికిత్సలు పొందవచ్చు అన్నారు. ముఖ్యంగా మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి గైనకాలజీ ప్రసూతి సంబంధిత సమస్యలను సాధారణ వైద్య సమస్యలను సంబంధించిన సమస్యలను పరిష్కరించుకోవచ్చు అన్నారు. మధ్యతరగతి కుటుంబాల వారికి ఈ వైద్య శిబిరం ఉపయోగపడేలా ప్రత్యేకంగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలకు వైద్యం అందించడం ఒక సేవగా భావించి ఈ నిర్ణయం తీసుకొని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అత్యవసర పరిస్థితుల్లోనే కాకుండా ప్రారంభ దశలోనే వ్యాధులను గుర్తించి సరైన చికిత్సలు పొందాలని వారు కోరారు. ఇప్పటికే మా వైద్యశాల నందు 24 గంటల అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఉచిత వైద్య శిబిరమునకు వచ్చిన ప్రతి ఒక్కరికి ఉచిత అన్నదానం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కావున ఈ ప్రాంత వాసులు ఈ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

## మన పరిసరాలను మనమే శుభ్రంగా ఉంచుకోవడం మం బాధ్యత

### గిద్దలూరు స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కమీషనర్ రమణ బాబు





**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 22**

గిద్దలూరు పురపాలక సంఘం లో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ప్రతినెల నాలుగవ శనివారం కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రమైన నగరం,పచ్చదనంతో నిండిన సమాజం అనే నినాదంతో నిర్వహించారు. కార్యక్రమంలో పురపాలక సంఘ కమిషనర్ ఈ వి రమణ బాబు మాట్లాడుతూ మన పరిసరాలను మనము పరిశుభ్రంగా ఉంచుకోవాలని పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం మన బాధ్యతన్నారు. పచ్చదనం కూడా ముఖ్యమైన కర్తవ్యం అని తెలియజేశారు. మన సమాజం ఆరోగ్యకరమైనటువంటి వాతావరణంలో ఉండాలి అంటే అది కేవలం పరిసరాలు పరిశుభ్రత , పచ్చదనం ద్వారానే సాధ్యపడుతుందని, మన ఇంటిని ఎలాగైతే పరిశుభ్రంగా ఉంచుకుంటామో మన పరిసరాలను కూడా అలాగే పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని, నేడు మనము అనుభవిస్తున్నటు వంటి ఈ వర్షాభావ పరిస్థితులు,కరవు కాటకాలు పచ్చదనం లోపించడం ద్వారానే ఏర్పడుతున్నాయి అని గుర్తు చేశారు. ఎస్ బి ఐ ప్రధాన కార్యాలయం రోడ్డు పక్కన , కుమ్మరంకట్ట వద్ద ఉన్న చెత్తను తొలగించి బ్లీచింగ్ చల్లారు. అనంతరం సిబ్బంది, ప్రజల చేత కమిషనర్ మున్సిపల్ కార్యాలయం లో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి ,స్వర్ణ వార్డు సచివాలయ శానిటేషన్ సెక్రటరీలు, పారిశుధ్య సిబ్బంది , పుర ప్రజలు పాల్గొన్నారు.

## 31న నల్లమల సాగర్‌కు సాగర జలాలు

### 30 ఏళ్ల కల నెరవేరనుంది -బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి

**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 22**

మార్కాపురం ప్రజల మూడు దశాబ్దాల స్వప్నం నెరవేరే సమయం ఆసన్నమైందని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి అన్నారు. ఈ నెల 31న వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం ద్వారా నల్లమల సాగర్‌కు కృష్ణా జలాలు రానున్నాయని, దీని కోసం రైతులు, ప్రజలు వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారని తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభం ఈ ప్రాంత చరిత్రలో సువర్ణ అధ్యాయమని, ఈ ప్రాజెక్టుతో బీడు భూములు పచ్చని పంట పొలాలుగా మారతాయని, మార్కాపురం, నెల్లూరు, కడప జిల్లాల్లో సాగునీటి కొరత తీరుతుందని



పేర్కొన్నారు. వెలిగొండ కోసం తమ పొలాలు, ఇళ్లు, జ్ఞాపకాలను త్యాగం చేసిన నిర్వాసిత కుటుంబాల త్యాగాలను ఎప్పటికీ మరువలేమని, వారి త్యాగాల పునాదులపైనే ఈ ప్రాజెక్టు నిలిచిందని, నల్లమల సాగర్‌లోకి వచ్చే ప్రతి నీటి బొట్టు వారి త్యాగానికి నిదర్శనమని ఏలూరి అన్నారు. సాగునీరు అందుబాటులోకి రావడంతో వ్యవసాయ రంగంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని, రైతుల జీవితాల్లో వెలుగులు నిండుతాయని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

## నూజిళ్లపల్లిలో వివాదాస్పద స్థలం పరిశీలన

### కలెక్టర్ ఆదేశాలతో క్షేత్రస్థాయికి అధికారుల బృందం

### రెండు రోజుల్లో పూర్తి వివరాలు వెల్లడిస్తామన్న ఆర్డీవో





**అద్దంకి, ఆర్.సి(పెన్ పవర్) ఆగస్టు 22:**

జే.పంగులూరు మండలం, నూజిళ్లపల్లిలో వివాదాస్పదంగా మారిన సర్వే నంబర్ 133లోని ప్రభుత్వ డొంక పోరంబోకు స్థలాన్ని అద్దంకి ఆర్డీవో విజయ జ్యోతి కుమారి, దర్శి డీఎస్పీ బాలమురళీకృష్ణ శనివారం పరిశీలించారు. గ్రామంలోని ఎస్సీ కాలనీ వాసులు ఇటీవల ఈ స్థలంలో ఆర్చి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు ప్రయత్నించారు. అది ప్రభుత్వ డొంక స్థలమని కొందరు అధికారులకు ఫిర్యాదు చేయడంతో వారు నిర్మాణాలను అడ్డుకున్నారు. ఆందోళనకు దిగిన వారిని రేణింగవరం పోలీస్ స్టేషన్ కు తరలించారు. దీనిపై దళిత సంఘాలు, కేవీపీఎస్ నాయకులు, కాలనీ వాసులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ విగ్రహం, ముఖద్వారం ఏర్పాటుకు అనుమతించాలని ఒంగోలు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ఘటనపై స్పందించిన కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం రెవెన్యూ, పోలీసు అధికారులు నూజిళ్లపల్లిని సందర్శించారు. స్థలంలో హద్దులను నిర్ణయించి, అక్కడ నివాసం ఉంటున్న వారి పేర్లు, సామాజిక వర్గం, కుటుంబ సభ్యుల సంఖ్య తదితర వివరాలను రెవెన్యూ సిబ్బంది సేకరించారు. ఆ వివరాలతో కూడిన పూర్తిస్థాయి నివేదికను ఆర్డీవోకు త్వరలోనే సమర్పిస్తామని తహసీల్దార్ పోపూరి. సింగారావు వెల్లడించారు. ?నివేదిక అందిన రెండు రోజుల తర్వాత మళ్లీ గ్రామానికి వచ్చి విగ్రహం, ఆర్చి నిర్మాణ అనుమతులపై పూర్తి వివరాలు తెలియజేస్తామని ఆర్డీవో స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అద్దంకి గ్రామీణ సీఐ మల్లికార్జునరావు, రేణింగవరం ఎస్సై సురేష్, ఉప తహసీల్దార్ అర్జున్, వీఆర్వో, గ్రామ సర్వేయర్, ఎస్సీ కాలనీ వాసులు, స్థానికులు పాల్గొన్నారు.

## శ్రీ పట్టాభిరామస్వామి ఆలయంలో టీడీపీ నేతల ప్రత్యేక పూజలు



**తర్లపాడు పెన్ పవర్ ఆగస్టు 22**

వెలిగొండ ప్రాజెక్టుకు కృష్ణా జలాలు విడుదల చేస్తున్న సందర్భంగా ఎటువంటి ఆటంకాలు జరగకుండా తర్లపాడు మండలంలోని శ్రీ పట్టాభిరామస్వామి దేవాలయంలో టీడీపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా కృష్ణా జలాలు త్వరలో పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టుకు నీరు రావాలని, రైతుల కళలు నెరవేరాలని పూజలు చేశారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఫ్లెక్సీలకు టీడీపీ శ్రేణులు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో టీ సుబ్బయ్య, ఈర్ల పెద్ద కాశయ్య, ఈర్ల వెంకటయ్య, అంగిరేకుల బాలకోటయ్య, తిప్పిరెడ్డి వెలుగొండ వెలుగొండ రెడ్డి, దోగిపర్తి మల్లికార్జునరావు, జి వెంకటేశ్వర్లు,ఎస్ కే భాష, మేకల వెంకట్, కుందూరు చిన్న కాశిరెడ్డి, వి వెంకటరెడ్డి ,పిన్నికి బాలరాజు,దొడ్డ వెంకటేశ్వర్లు దొడ్డ సుబ్బారెడ్డి ,కోలగోట్ల నారాయణరెడ్డి, బుర్రి వెంకటేశ్వర్లు, శ్రీను తదితరులు మహిళలు పాల్గొన్నారు.

## ఆగస్టు 31న బేస్బాల్ టోర్నీకి జిల్లా క్రీడాకారుల ఎంపిక

**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 22**

సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో సెప్టెంబర్ 12 నుంచి 14 వరకు జరగనున్న రాష్ట్రస్థాయి సీనియర్ బేస్బాల్ పురుషులు, మహిళల టోర్నమెంట్లో పాల్గొనే జిల్లా జట్ల ఎంపికను ఆగస్టు 31న పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కంచర్ల వారి పల్లి క్రీడా మైదానం నందు జిల్లాస్థాయి సీనియర్ బేస్బాల్ పురుషులు, మహిళల క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నట్లు జిల్లా బేస్బాల్ అసోసియేషన్ కార్యదర్శులు పెరుగు రమేష్, సంగిశెట్టి రాజా తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసక్తి ఉన్న సీనియర్ పురుషులు, మహిళల క్రీడాకారులు ఆగస్టు 31న ఉదయం 9 గంటలకల్లా కంచర్లవారిపల్లి పాఠశాల క్రీడా ప్రాంగణానికి చేరుకోవాలని సూచించారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు తప్పనిసరిగా మూడు పాస్పోర్ట్ సైజు ఫొటోలు, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతిని వెంట తీసుకురావాలని తెలిపారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులకు రాష్ట్రస్థాయి టోర్నమెంట్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించే అవకాశం లభిస్తుందని క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు పూర్తి వివరాలకు 9848084818, 7569905542, 9866537841 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

# పెండింగ్ క్లెయిమ్‌లను త్వరగా పరిష్కరించాలి

## ప్రత్యేక క్యాంపెయిన్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత

**పెన్ పవర్ తర్లుపాడు ఆగస్టు 22**

ఓటర్ల జాబితా సమగ్ర సవరణలో భాగంగా నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత శనివారం పరిశీలించారు. మండలంలోని సీతానాగులవరం గ్రామంలో 124, 126 పోలింగ్ కేంద్రాలను ఆమె సందర్శించి, అక్కడ జరుగుతున్న క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ, విచారణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బందితో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల నమోదు, తొలగింపు, మార్పులు, చేర్పులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను ఎప్పటికప్పుడు పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఓటర్ల జాబితాలో పేర్ల నమోదు, వివరాల్లో తప్పుల సవరణ, చిరునామా మార్పు, ఒక నియోజకవర్గం నుంచి మరో నియోజకవర్గానికి ఓటు బదిలీ వంటి ప్రక్రియలకు ప్రత్యేక క్యాంపెయిన్ రోజులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. ఈ నెల 29, 30 తేదీల్లో కూడా ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం



చేసుకోవాలని, ఓటర్ల జాబితాలో తమ వివరాలను పరిశీలించుకుని అవసరమైన సవరణలు చేసుకోవాలని సూచించారు. రాబోయే రోజుల్లో నిర్వహించే ప్రత్యేక క్యాంపుల్లో ప్రజలు చురుకుగా పాల్గొని ఓటర్ల జాబితా



సవరణ ప్రక్రియకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహసిల్దార్ శిరీష,బీఎల్ఓలు,రెవెన్యూ సిబ్బంది, వివిధ శాఖల వారు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి



**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 22**

ప్రాథమిక పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి వారి బంగారు భవిష్యత్ కు బాటలు వేయాలని ఎంఇఓ గిరిధర్ శర్మ ఉపాధ్యాయులను కోరారు. శనివారం స్కూల్ సి కాంప్లెక్స్ లో పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వం విద్యా రంగంలో పెను సంస్కరణలను తీసుకొచ్చిందన్నారు. అందుకు అనుగుణంగా విద్యను విద్యార్థులకు బోధించి చిన్న నాడే పునాది వేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం లో నిర్దేశించిన పౌష్టికాహారం అందించాలని కోరారు. పిల్లల్లో సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించే విధంగా బోధన జరగాలని వారిలోని ప్రతిభ ను వెలికి తీసేందుకు కృషి చేయాలన్నారు.కార్యక్రమంలో ఎంఇఓ 1 మోనుద్దీన్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సూర్య శ్రీ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థిని వైద్య ఖర్చులు నిమిత్తం 50 వేలు ఆర్థిక సాయం



**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు ఆగస్టు 22**

సూర్య శ్రీ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థినికి వైద్య ఖర్చు నిమిత్తం రూ. 50,000 లు ఆర్థిక సాయం అందజేసినట్లు ఆ ట్రస్ట్ సెక్రటరీ సర్దార్ భాష తెలిపారు. ఖమ్మం జిల్లా కొత్తగూడెం కు చెందిన గొల్లపల్లి రజిని కుమార్తె గొల్లపల్లి రితిక బీటెక్ సెకండియర్ చదువుతోంది. ఆ విద్యార్థినికి ఫిట్స్ రావడంతో ఆసుపత్రిలో చేర్పించగా దాదాపు 20 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. ఆర్థిక స్థోమత లేకపోవడం వలన సూర్య శ్రీ ట్రస్టును సంప్రదించగా ఆ ట్రస్టు సెక్రటరీ సర్దార్ భాష, ప్రవాస భారతీయుడు నాగమల్ల తాటి ఉదయ్ కిరణ్ సహకారంతో నేరుగా ఆస్పత్రికి వెళ్లి రితిక తల్లి రజనీకి రూ.50,000/-లు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు వారికి ధన్యవాదాలు తెలిపారు.

# పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితా విడుదల

**పీసీ పల్లి, పెన్ పవర్ ఆగస్టు 22**

మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితాను విడుదల చేసినట్లు ఎంపీడీఓ జివి కృష్ణారావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ జాబితాను ఈ నెల 23వ తేదీన మండల పరిషత్ కార్యాలయం, అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాలు, ప్రధాన కూడళ్లు, పాఠశాలలు, గ్రామ చావిడిల వద్ద ప్రదర్శించనున్నారు. ఈ జాబితాపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 26వ తేదీ లోపు సంబంధిత పంచాయతీ కార్యదర్శికి లేదా మండల అధికారికి లిఖితపూర్వకంగా తెలియజేయాలని సూచించారు. అనంతరం తుది జాబితాను 29న జిల్లా కలెక్టర్ ఆమోదానికి పంపి, 31వ తేదీన తుది జాబితాను ప్రచురిస్తామని తెలిపారు. గడువు తర్వాత వచ్చే అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోబోమని స్పష్టం చేశారు.

# ఆధునిక బోధనతోనే విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపు

## జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్బారావు స్పష్టం

**పొదిలి, పెన్ పవర్, ఆగస్టు 22**

మారుతున్న పరిస్థితులకు అనుకూలంగా బోధనా విధానాలను మార్చుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి సామా సుబ్బారావు చెప్పారు. శనివారం నాడు పొదిలిలో జరిగిన పొదిలి, కొనకనమిట్ల మండలాల బయాలజీ, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుల క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా డి ఈ ఓ సుబ్బారావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు సాంకేతిక పరిజ్ఞానాన్ని, ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ను తరగతి బోధనలో ఉపయోగించి విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో బోధనలు సాగించాలని ఆయన సూచించారు. పాఠశాలల్లో పదవ తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలను సమీక్షించి, మెరుగైన ఫలితాలు లభించే విధంగా ఇప్పటి నుండే ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆయన సూచించారు. బడికి రాని విద్యార్థుల సమాచారాన్ని సేకరించి, వారి అడుగులు బడివైపు మళ్ళించే విధంగా కృషి చేయాలని డి ఈ ఓ సుబ్బారావు కోరారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ చైర్మన్ షేక్ కరీమున్ బి, మండల విద్యాశాఖ అధికారి బాదం వెంకటేశ్వర రెడ్డి, టి నాగలక్ష్మి, ఉపాధ్యాయులు కిరణ్మయి తో పాటు పలువురు పాల్గొన్నారు.



# చోరీలపై పోలీసుల కొరడా..

# 19 కేసుల్లో 13 కేసుల సొత్తు రికవరీ..!

## రూ.12.65 లక్షల విలువైన బైకులు, బంగారం స్వాధీనం



**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 22**

మార్కాపురం టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీ కేసులపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఈ ఏడాది మే 1 నుండి ఆగస్టు 22 వరకు నమోదైన 19 చోరీ కేసుల్లో ఇప్పటికే 13 కేసులకు సంబంధించిన సొత్తును రికవరీ చేసినట్లు పోలీసులు పత్రికా ప్రకటనలో వెల్లడించారు. మొత్తం 19 కేసుల్లో 11 మోటార్ సైకిల్ చోరీ కేసులు కాగా, 8 బంగారు, వెండి ఆభరణాల చోరీ కేసులు ఉన్నాయి. వీటిలో 8 మోటార్ సైకిళ్లు, 5 కేసులకు సంబంధించిన బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. రికవరీ చేసిన సొత్తు విలువ సుమారు రూ.12,65,000/- గా ఉందని, స్వాధీనం చేసుకున్న సొత్తును కోర్టులో ప్రవేశపెట్టి, న్యాయస్థానం ఆదేశాల మేరకు బాధితులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

**14 సీసీ కెమెరాలు, అవుట్ పోస్ట్ తో నిఘా..**

ప్రకాశం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు మార్గదర్శకత్వంలో, మార్కాపురం ఎస్.డి.పి.ఓ నాగరాజు పర్యవేక్షణలో సిఐ మహమ్మద్ అల్తాఫ్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఎస్సై విశ్వనాథ్ రెడ్డి సిబ్బంది నిరంతరం దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు. చోరీల నివారణలో భాగంగా మార్కాపురం ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో 14 సిసి కెమెరాలను ఏర్పాటు చేసి, పోలీస్ అవుట్ పోస్ట్ ద్వారా నిరంతర పర్యవేక్షణ, పగలు, రాత్రి బీట్ లను పటిష్టం చేశామని వివరించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను గుర్తిస్తున్నామని పేర్కొన్నారు.

# నెమలిగుండ్ల క్షేత్రానికి పోటెత్తిన భక్తులు





**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 22**

గిద్దలూరు సమీపంలో నలమల్ల అటవీ ప్రకృతి సౌందర్యాల మధ్య వెలసిన నెమలిగుండ్ల రంగనాయక స్వామి క్షేత్రానికి శనివారం భక్తులు పోటెత్తారు పలువురు భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించి మ్రొక్కులు చెల్లించుకున్నారు. మరికొందరు రంగస్వామి సేవ చేయించారు. ఈసేవలో అగ్నితో చేసే విన్యాసాలు అబ్బురపర పరుస్తాయి. వేకువఝామున్నే అర్చకులు స్వామివారికి అభిషేకాది కార్యక్రమాలను నిర్వహించి , పత్యేక అలంకరణ చేసి భక్తుల కు దర్శనం కల్పిస్తారు. నెమలిగుండ్ల రంగడు ఈప్రాంత వాసుల ఇలవేల్పు , కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం కావటంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఈ ఆలయం ఒక్క శనివారం మాత్రమే తెరుస్తారు. మిగతా రోజుల్లో స్వామిదర్శనం ఉండదు. కాకుండా ఈ ఆలయ క్షేత్రానికి ఒక ప్రత్యకత నెలకొని ఉంది ఆలయ ప్రాంగణంలో కి మైలాసోకిన వారు వెళితే తేనెటీగలు వెంబడిస్తాయి ఇది నేటికి కొనసాగుతుంది. గుండ్లకమ్మ నది గుండ్లబ్రహేశ్వరం వద్ద పుట్టి కొండ కొనల్లో ప్రవహించి నెమలిగుండ్ల రంగస్వామి చెంత ఎత్తైన కొండపై నుండి జలపాతంలా జాలువారి నెమలిగుండలో చేరి ఇక్కడి నుండి భూమిపై ప్రవహిస్తోంది. ఈగుండాన్ని మయూర మహర్షి తన ముక్కు పుటాలతో త్రవ్వాడని స్థలపురాణం బట్టి తెలుస్తుంది. శ్రావణ మాసం శనివారం కాటంతో భక్తులు ఆలయానికి పోటెత్తారు .నలమల్ల గిరులు గోవిందనామ స్మరణతో మారుమ్రోగాయి ఆలయకమిటీ భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు. అన్న సత్రాల్లో భోజన వసతి కల్పించారు.

# చిన్నారుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలి

## శిక్షణ కార్యక్రమాన్ని పర్యవేక్షించిన సిడిపిఓ షేక్ ఆశాబేగం

**సి.ఎస్.పురం,పెన్ పవర్ ఆగస్టు 22**

చిన్నారులకు అంగన్వాడీ దశ నుంచే నాణ్యమైన విద్య అందించి, వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని వెలిగండ్ల ఐసిడిఎస్ సిడిపిఓ షేక్ ఆశాబేగం అన్నారు. మండల కేంద్రంలోని సి. ఎస్. పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం అంగన్వాడీ కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి 120 రోజుల సర్టిఫికెట్ కోర్సులో భాగంగా మూడు రోజుల శిక్షణా తరగతులను ప్రారంభించారు. శిక్షణా తరగతులను సిడిపిఓ షేక్ ఆశాబేగం పర్యవేక్షించారు తొలిరోజు కీ రిసోర్స్ పర్సన్స్ ఆధ్వర్యంలో కార్యకర్తలకు వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. చిన్నారులకు అవసరమైన మౌలిక వసతులు, సమర్థవంతమైన



విద్యాబోధన పద్ధతులు, సంఖ్యా పరిజ్ఞానం, పాఠశాల సంసిద్ధత, ఆటల ద్వారా అభ్యసనం, బాలల సమగ్ర అభివృద్ధి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. స్థానికంగా లభించే వనరులను వినియోగించుకుని బోధనా సామగ్రిని తయారు చేసుకునే విధానాన్ని వివరించారు.ఈ సందర్భంగా సీడీపీఓ షేక్ ఆశాబేగం మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలు చిన్నారుల విద్యకు తొలి మెట్టులాంటివని అన్నారు. ఈ దశలో పిల్లల్లో అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించేలా సరైన బోధనా పద్ధతులను అనుసరించాలన్నారు. ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం ద్వారా చిన్నారుల్లో ప్రాథమిక అక్షర, సంఖ్యా పరిజ్ఞానంతో పాటు ఆలోచనా శక్తి, సామాజిక నైపుణ్యాలు పెంపొందించడమే లక్ష్యమన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను అంగన్వాడీ కేంద్రాల్లో తప్పనిసరిగా అమలు చేయాలని కార్యకర్తలకు సూచించారు ఈ కార్యక్రమంలో కీ రిసోర్స్ పర్సన్ చెన్నయ్య, అంగన్వాడి సూపర్వైజర్ కృపావరం, ఆక్టివ్ సూపర్వైజర్ సరళ మరియు అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

# అక్షరాంధ్ర అక్షరాస్యతా పై జిల్లాస్థాయి శిక్షణ

**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 22**

2026-27 ఆర్థిక సంవత్సరములో వయోజన విద్యా శాఖ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న "అక్షరాంధ్ర" అక్షరాస్యతా కార్యక్రమము గురించి జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమము వయోజన విద్య ఉపసంచాలకులు బి. జగన్మోహన్ రావు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఒంగోలు డి.ఆర్.డి.ఎ సమావేశ మందిరములో జిల్లాలోని వివిధ మండలాల డి.ఆర్.డి.ఎ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ (ఎ.పి.యంలు), కమ్యూనిటీ కోఆర్డినేటర్ లు (సి.సిలు)తో సమావేశం నిర్వహించారు. ఒంగోలు డివిజనల్ సూపర్వైజర్ టి. పోతురాజు శిక్షకునిగా వ్యవహరించారు. వారు మాట్లాడుతూ జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరాంతానికి 98,475 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయుట లక్ష్యంగా నిర్దేశించినట్లు పేర్కొన్నారు. అక్షర కేంద్రాలను ప్రతి రోజు సాయంత్రం గం.5 నుండి గం.7 మధ్యలో నిర్వహించాలని పేర్కొన్నారు. అక్షరాంధ్ర యాప్ లో ప్రతి రోజు ఆన్లైన్ హాజరు నమోదు విధానము గురించి వారికి కరపత్రాల ద్వారా కూలంకషంగా వివరించారు. ఆన్లైన్ హాజరు రాష్ట్రస్థాయిలో విద్యా శాఖ కార్యదర్శి, జిల్లా స్థాయిలో కలెక్టరు, మండల స్థాయిలో ఎం.పి.డి.ఓలు వరిశీలించి వర్యవేక్షిస్థారని పేర్కొన్నారు. మార్చి-2027 వరకు 100 గంటల పాటు అక్షర కేంద్రాలలో బోధనాభ్యసన కార్యక్రమము పూర్తి చేయాలన్నారు. అలాగే సెప్టెంబర్ 08న అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఏపియంలను, సిసిలను కోరారు. ఈ కార్యక్రమానికి డిఆర్.డిఎ పిడి టి. నారాయణ, డి.పి.యం క్రిష్ణ కుమారి, ఏ.పి.యం. నరేంద్ర, వయోజన విద్య శాఖ గణాంక సహాయకులు పి.మాల్యాద్రి, సూపర్వైజర్ యన్. వెంకటేశ్వర్లు తోడ్పాటు అందించారు.

# అమ్మవారికి ఘనంగా కుంకుమ పూజా కార్యక్రమం



**సంతమాగులూరు, (బల్లికురవ) పెన్ పవర్, ఆగస్టు 22**

మండలంలోని కూకట్లపల్లి గ్రామంలో, ఆధ్యాత్మిక సందడి నెలకొంది . అమ్మవారికి అత్యంత ప్రీతిపాత్రమైన శ్రావణ మాసంలో ఈ కార్యక్రమాలు కొనసాగుతున్నందున మహిళలు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు . గ్రామానికి చెందిన ఆడపడుచులు కూడా స్వగ్రామానికి రావడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది .గ్రామ దేవతలైన పోలేరమ్మ తల్లి ,అంకమ్మ తల్లి ఆలయాల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా శనివారం కుంకుమ పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి పాత విగ్రహాలకు ప్రత్యేక పూజలు పూజలు కొనసాగాయి . తొలగించిన పాత విగ్రహాలను ఆదివారం బాలాలయంలోకి మార్చనున్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాచార్యులు శివ స్వామి బృందం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా అన్నసంతర్పణ కార్యక్రమం కొనసాగనుంది.

# జ్ఞాన జ్యోతి పై శిక్షణా కార్యక్రమం

**పొన్నలూరు పెన్ పవర్ ఆగస్టు 22**

స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం ఐసిడిఎస్ సూపర్వైజర్ రిజ్వానా ఆధ్వర్యంలో జ్ఞాన జ్యోతి పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా కె ఆర్ పి ఎస్ ఎస్.కె ఖాదర్ బాషా మాట్లాడుతూ చిన్నారుల్లో వైకల్యాలను ప్రాథమిక దశలను గుర్తించి వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించడంలో అంగన్వాడి కార్యకర్తలు కీలకపాత్ర పోషించాలని సూచించారు. అంగన్వాడి కేంద్రాలలో చిన్నారులకు ఆటపాటలతో కూడిన ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యాబోధన అందించాలని తెలిపారు. సమ్మేళత విద్య ప్రాధాన్యత ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలు 21 రకాల వైకల్యాలపై అంగన్వాడి కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పి శ్రీనివాసులు జి చంద్రశేఖర్ ఎం ఈ ఓ రవిచంద్ర అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# క్రీస్తు సంఘ సువార్తికులు ఐక్యత కలిగి సువార్త పని చేయాలి







**పెద్దదోర్నాల పెన్ పవర్ ఆగస్టు 22**

పట్టణంలోని చాట్ల యశ్వంత్ జన్మదిన వేడుకలు ఘనంగా శనివారం నిర్వహించడం జరిగింది. మార్కాపురం జిల్లా క్రీస్తు సంఘ సువార్తికుల చారిటబుల్ సొసైటీ ఆర్గనైజేషన్ సెక్రటరీ పల్లె బాబు, ట్రెజరర్ బుదాల అశోక్ కుమార్, క్రీస్తు సంఘం డైరెక్టర్ సింగా రాజేష్, గౌరవ అధ్యక్షులు చిలక ఇశ్రాయేలు . భారత్ పెట్రోల్ బంక్ దగ్గర ఉన్న టౌన్ క్రీస్తు సంఘము నందు జిల్లా క్రీస్తు సంఘ సువార్తికుల నెలవారి సహవాస కూడిక జిల్లా అధ్యక్షులు చాట్ల గంగయ్య ఆధ్వర్యంలో జరిగినది. యేసుక్రీస్తు ప్రభువును తన శిష్యులు ఏ విధంగా అయితే వెంబడించి ఆయన సువార్తను బోధిస్తూ ప్రకటించారో అలాగే సువార్తికులు అందరూ కూడా సువార్త ప్రచారాన్ని చేయాలని వాక్యం ద్వారా బోధించడం జరిగినది, అలాగే సువార్తికులు అందరూ కూడా తమ్మును తాము తగ్గించుకొని గర్వము, మస్తరము ఏమి లేకుండా సహోదరులందరూ ఐక్యత కలిగి సమాధానముతో వాక్యాన్ని బోధించాలని బోధించడం జరిగినది, దైవజనులు ఐక్యతను కాపాడుకోనుటకు జాగ్రత్త పడాలి అని సహోదర ప్రేమ కలిగి జీవించాలని బోధించడం జరిగినది. అలాగే చాట్ల గంగయ్య పెద్ద కుమారుడు చాట్ల యశ్వంత్ పుట్టినరోజు కేక్ కట్ చేసి ఘనంగా జరుపుకోవడం జరిగినది, ఈ కార్యక్రమంలో ఈసీ మెంబర్ ఎమ్ ఏలియా, కత్తి బాబు రావు, విడుదల లక్ష్మయ్య, చిలక పెద్దకోటయ్య, చాట్ల రాజు, బూదాల జాన్ బాబు, ఎనిబెర కోటయ్య, ముండ్ల రమేష్, బెతం యోహాను, పి. కోటేష్ అలాగే జిల్లా వ్యాప్తంగా ఉన్న నాలుగు నియోజకవర్గాల నుండి అధిక సంఖ్యలో క్రీస్తు సంఘ సువార్తికులు పాల్గొనడం జరిగినది.

# పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

## జిల్లా కార్యక్రమ అధికారి డాక్టర్ ఉమావతి





**ఆనందపురం, పెన్ పవర్, ఆగస్టు 22**

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని జిల్లా కార్యక్రమ అధికారి డాక్టర్ ఉమావతి స్పష్టం చేశారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం 'స్వర్ణాంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఇళ్లు, కార్యాలయాలు, ఆసుపత్రుల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా, చెత్త పేరుకుపోకుండా చూసుకోవడం ద్వారా అంటువ్యాధులను అరికట్టవచ్చని సూచించారు. అనంతరం పీహెచ్‌సీ ఆవరణను వైద్య సిబ్బంది శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ బాలాజీ, డాక్టర్ షబీనా భాను, విస్తరణాధికారి శ్యామలరావు, ఫార్మసీ అధికారి జయకుమార్, పర్యవేక్షకులు పార్వతమ్మ, కృష్ణమోహన్, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# దివ్యాంగుల ఆధ్వర్యంలో మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు



**అమలాపురం, పెన్ పవర్, ఆగస్టు 22**

మెగాస్టార్ చిరంజీవి 71 వ జన్మదిన సందర్భంగా స్థానిక ఈధరపల్లి దగ్గర ఎస్కే ఓల్డ్ ఏజ్ హోమ్ లో అంబేద్కర్ కోనసీమ జిల్లా దివ్యాంగుల ఐక్య జేఏసీ, జనసేన నాయకులు పెనుమాల నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా చిరంజీవి పుట్టినరోజు వేడుకలు నిర్వహించాము .అనంతరం కేక్ కట్ చేసి ఫ్రూట్స్ బిస్కెట్లు రొట్టెలు వృద్ధులకు వికలాంగులకు పంపిణీ చేయడం జరిగినది .ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చిరంజీవి బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని సినీ రంగంలో అడుగుపెట్టి బ్లడ్ బ్యాంకులో ఏర్పాటు చేసి ఎంతోమంది పేద ప్రజలకు, దివ్యాంగుల పట్ల ఆసక్తితో వారికి సహాయ సహకారాలు అందిస్తూ సినీ రంగంలో చాలామంది దివ్యాంగులకు అవకాశాలు కల్పించి కల్పించడానికి కృషి చేశారు. ఈ సందర్భంగా పలువురు దివ్యాంగులు ఆయన పుట్టినరోజు పట్ల హర్ష వ్యక్తం చేశారు .ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ దివ్యాంగుల మహా సంఘటన అధికార ప్రతినిధి నిమ్మకాయల సురేష్ ఎస్కే ఓల్డ్ ఏజ్ హోమ్ ట్రస్ట్ చైర్మన్ సూర్య కళ కొప్పిశెట్టి వెంకట ప్రసాద్, వృద్ధులు దివ్యాంగులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఎంపీడీవో ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర -స్వర్ణాంధ్ర

**అయినవిల్లి, పెన్ పవర్, ఆగస్టు 22**

అయినవిల్లి మండలంనేదునూరు గ్రామశీ లో స్వర్ణాంధ్ర స్వచ్ఛంద్రా కార్యక్రమంలో అయినవిల్లి మండల అభివృద్ధి అధికారి జి .సరోవర రావు ఆధ్వర్యంలో నిర్వహించడమైనది. ఈ కార్యక్రమంలోఎంపీటీసీ సభ్యులు కల్లెపల్లి వెంకట సుబ్బరాజు ,మాజీ సర్పంచ్ గుమ్మడి వెంకటేశ్వర రావు ,టీడీపీ గ్రామ అధ్యక్షులు తమ్మన శ్రీనివాస్ , కూటమి నాయకులు, పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ అన్వర్ , పంచాయతీ సిబ్బంది, స్వర్ణ గ్రామం సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామ పెద్దలు,గ్రామ ప్రజలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# జ్ఞాన జ్యోతి రెండో విడత శిక్షణా కార్యక్రమం

## చిన్నారుల సమగ్ర అభివృద్ధి ఐసిడిఎస్ లక్ష్యం కావాలి....

## విద్యాశాఖ అధికారి లక్ష్మీనారాయణ

**సంతమాగులూరు, (బల్లికురవ) పెన్ పవర్, ఆగస్టు 22**

మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం శనివారం ఆరంభమైంది. మూడు రోజులపాటు ఈ కార్యక్రమం కొనసాగనుంది.స్థానిక విద్యా వనరుల భవనంలో ఈ కార్యక్రమానికి విద్యాశాఖ అధికారి లక్ష్మీనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమంలో తెలుసుకున్న అంశాలను కేంద్రాలలో ఆచరించటం ద్వారా చిన్నారుల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుంది అన్నారు.. మూడు నుండి ఐదు సంవత్సరాల వయసు కలిగిన చిన్నారులకు ఆటపాటలతో పాటు, నాణ్యమైన ప్రాథమిక విద్య అందించేందుకు రూపొందించిన కార్యక్రమం జ్ఞాన జ్యోతి అన్నారు. ఇందులో భాగంగా చిన్ననాటి నుండి విద్యలో నూతన బోధన పద్ధతులు పరిచయం చేయటం, చిన్నారుల శారీరక, మానసిక ఆరోగ్య పరిస్థితి, మరింత అభివృద్ధి సాధించే విధంగా పునాది వేయటం, అంగన్వాడి కేంద్రాల పరిసరాలను ఆకర్షణీయంగా, ఆహ్లాదకరంగా, పిల్లలు చదువుకునేందుకు ఆసక్తి చూపించే విధంగా ఎలా రూపొందించాలో వివరించారు. విద్యాశాఖ అధికారి.2 రమేష్ బాబు మాట్లాడుతూ బోధన అంశాలను చిన్నారులకు అర్థమయ్యే రీతిలో వివరించడం ద్వారా వారిలో మరింత మానసిక పరిపక్వత పెంపుతుందన్నారు. కేంద్రాల నిర్వహణ,



గర్భిణీలు, బాలింతలకు పౌష్టిక ఆహారం సమయానుకూలంగా అందజేయడంలో కార్యకర్తలు శ్రద్ధ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో.. డి ఆర్ పి లు రామకృష్ణ, సురేష్, వీరనారాయణ, సూపర్వైజర్లు సలోమి, విజయనిర్మల, పాఠశాల ఉపాధ్యాయులు, 64 కేంద్రాల అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# గల్లంతైన మత్స్యకారుల కోసం గాలింపు ముమ్మరం చేయాలి -వాసుపల్లి జానకిరామ్ డిమాండ్




**విశాఖపట్నం, పెన్ పవర్, ఆగస్టు 22**

కోనసీమ జిల్లా వాడలరేవు నుంచి వేటకు వెళ్లి గల్లంతైన ఏడుగురు మత్స్యకారుల ఆచూకీ కోసం గాలింపు చర్యలను మరింత విస్తృతం చేయాలని ఈస్ట్ కోస్ట్ మెకానైజ్డ్ ఫిషింగ్ బోట్ ఓనర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్ డిమాండ్ చేశారు. గత నెలలో విశాఖపట్నం తీరంలో జరిగిన బోటు ప్రమాద విషాదం మరువకముందే, ఆగస్టు 3న వాడలరేవు వద్ద మరో ఏడుగురు మత్స్యకారులు ఫైబర్ బోటుతో సహా అదృశ్యమవ్వడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖ ఘటనలో కేవలం మూడు రోజులకే గాలింపు చర్యలు నిలిపివేయడం సరికాదని, ఫైబర్ బోట్లు సముద్ర ప్రవాహాలు, గాలుల ప్రభావంతో చాలా దూరం కొట్టుకుపోయే ప్రమాదం ఉన్నందున వాడలరేవు ఘటనలో సుదీర్ఘంగా, విస్తృత పరిధిలో సెర్చ్ ఆపరేషన్ కొనసాగించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తగిన రీతిలో స్పందించకపోవడంతో ఈ విషయాన్ని తాము మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఆయన చొరవతో కేంద్ర రక్షణ, హోంశాఖలకు లేఖలు రాయగా, స్పందించిన కేంద్ర ప్రభుత్వం ఇండియన్ నేవీ, కోస్ట్ గార్డ్ ద్వారా గాలింపు చర్యలను ముమ్మరం చేయడం అభినందనీయమని, ఇందుకు కేంద్రంతో పాటు వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. మత్స్యశాఖ వైఫల్యాలపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, కేంద్రం అందిస్తున్న భద్రతా ట్రాన్స్పాండర్లు లేకుండానే బోట్లు ఎలా సముద్రంలోకి వెళుతున్నాయో అధికారులు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. వాడలరేవు ఘటనలో బోటుకు ట్రాన్స్పాండర్ లేకపోవడం వల్లే గాలింపు క్లిష్టంగా మారిందని, రెండేళ్ల క్రితమే సాంకేతిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించలేదని మండిపడ్డారు. వాడలరేవులోనే 40 బోట్లకు లైసెన్సులు పెండింగ్‌లో ఉన్నాయని, లైసెన్సుల జారీలో జరుగుతున్న అవినీతిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్రంలోని 8 లక్షల మంది మత్స్యకారుల్లో కేవలం 2 లక్షల మందికే బీమా ఉండటం దారుణమని, అర్హులందరికీ బీమా కల్పించడంతో పాటు ప్రమాదాలకు గురయ్యే ఫిషింగ్ బోట్లకు కూడా ప్రత్యేక బీమా సౌకర్యం కల్పించాలని, శాశ్వత సముద్ర భద్రతా విధానాన్ని తక్షణమే రూపొందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# విఎంఆర్‌డీఏ చైర్మన్ పై చర్యలు తీసుకోవాలి

## మంత్రి లోకేష్‌కు జనసేన నేత మూర్తి యాదవ్ వినతి

**విశాఖపట్నం, పెన్ పవర్, ఆగస్టు 22**

కూటమి ప్రభుత్వ ప్రతిష్టకు భంగం కలిగించేలా వ్యవహరిస్తున్న విఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ అక్రమాలపై విచారణ జరిపి, ఆయనను తక్షణమే పదవి నుంచి తప్పించాలని జనసేన నేత పీతల మూర్తి యాదవ్ డిమాండ్ చేశారు. విశాఖ పర్యటనకు వచ్చిన రాష్ట్ర ఐటీ, విద్యారంగ మంత్రి నారా లోకేష్‌ను పార్టీ కార్యాలయంలో కలిసి ఈ మేరకు సమగ్ర వినతిపత్రం అందజేశారు. ప్రణవ్ గోపాల్ తన పదవిని దుర్వినియోగం చేస్తూ కూటమి నేతల పేర్లతో అధికారులను, విద్యాసంస్థల నిర్వాహకులను బెదిరింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. విజయనగరంలో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వైసీపీ నేతల లేఅవుట్‌కు స్థానిక ఎమ్మెల్యే వద్దంటున్నా ముడుపులు తీసుకుని అనుమతులు మంజూరు చేశారని పేర్కొన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం కనెక్టివిటీ రోడ్లలో భారీగా కమీషన్లు దండుకోవడంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయని, ఎయిర్‌పోర్టుతో సంబంధం లేని వైసీపీ మాజీ నేతల ప్రాజెక్టులకు కోట్ల రూపాయలతో రోడ్లు వేశారని వివరించారు. నిబంధనలకు విరుద్ధంగా కుటుంబ సభ్యులకు నామినేషన్ పద్ధతిలో కాంట్రాక్టులు ఇవ్వడం, బినామీల ద్వారా టెండర్లు నియంత్రించడం లాంటి అక్రమాలు చేస్తున్నారని తెలిపారు. ఐటీ విభాగంలో గతంలో తక్కువ వ్యయంతో




నడిచిన వ్యవస్థను కాదని, బినామీ కంపెనీలను తెచ్చి యాప్‌ల పేరిట నెలకు లక్షల్లో ప్రజాధనం దోచుకుంటున్నారని మూర్తి యాదవ్ పేర్కొన్నారు. అలాగే కాలేజీల రెన్యువల్స్ పేరిట వసూళ్లకు పాల్పడుతూ విద్యాసంస్థలను వేధిస్తున్నారని తెలిపారు. నిబంధనలను కాలరాసి వాణిజ్య సముదాయాలను దీర్ఘకాలిక లీజులకు కట్టబెట్టిన బోర్డు తీర్మానాలపై పునఃసమీక్ష జరపాలని, నిష్పక్షపాత విచారణతో కూటమి ప్రతిష్టను కాపాడాలని మంత్రి నారా లోకేష్‌ను కోరారు.

# విశాఖ విమానాశ్రయంలో నారా లోకేశ్‌ను కలిసిన కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్



**ఆనందపురం, పెన్ పవర్, ఆగస్టు 22**

విశాఖ విమానాశ్రయంలో వేములవలస మాజీ ఉపసర్పంచ్, తెలుగుదేశం పార్టీ నాయకుడు కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఆయనతో మాట్లాడినట్లు తెలిపారు. విశాఖ విమానాశ్రయంలో అనుకోకుండా నారా లోకేశ్ ఎదురుపడటంతో నవీన్ జ్ఞానేశ్వర్ ఆయనను కలిసి పలకరించారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న పరిస్థితులు, ప్రజలకు సంబంధించిన పలు అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి ప్రజల ఆకాంక్షలను నాయకుల దృష్టికి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేస్తున్నారని నవీన్ జ్ఞానేశ్వర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తామన్నారు. పార్టీ అధిష్ఠానం సూచనలకు అనుగుణంగా స్థానికంగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నారా లోకేశ్‌తో కలిసిన విషయాన్ని నవీన్ జ్ఞానేశ్వర్ పార్టీ శ్రేణులతో పంచుకున్నారు. ఈ భేటీ సందర్భంగా తీసుకున్న ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

# కార్యాలయాలు పరిసరాలు పరిశుభ్రత బాధ్యతాయుతంగా నిర్వహించాలి

## – జిల్లా రెవెన్యూ అధికారి వి. సుబ్బారావు



**అమలాపురం, పెన్ పవర్, ఆగస్టు 22**

"స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణ ఆంధ్ర" లో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు పరిసరాలు పరిశుభ్రత బాధ్యతాయుతంగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి వి.సుబ్బారావు తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్లోని జిల్లా రెవెన్యూ అధికారి ప్రాంగణం నందు రెవెన్యూ అధికారులు, అన్ని విభాగాల సిబ్బందితో కలిసి స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ జిల్లాలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం లక్ష్యాలను విజయవంతం చేయాలని, అదేవిధంగా కలెక్టరేట్ ప్రాంగణంలో చెత్త వెయ్యకుండా వ్యర్థాలను నిర్దేశిత ప్రదేశాలలో మాత్రమే వేయడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి నీటి వనరుల కలుషితం చేయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ఉండాలని ఆయన కోరారు. ప్రభుత్వ కార్యాలయాలు మరియు కలెక్టరేట్ ప్రాంగణంలో అన్ని విభాగాలు వద్ద ఏర్పాటుచేసిన డస్ట్ బిన్లలో మాత్రమే చెత్తను వేసి కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పరిపాలన అధికారి కే.నాగలక్ష్మమ్మ,రెవిన్యూ సిబ్బంది అన్ని విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాల స్వచ్ఛాంధ్రాలో గంటా




**విశాఖపట్నం, పెన్ పవర్, ఆగస్టు 22**

జీవీఎంసీ 6వ వార్డు రిక్షా కాలనీలోని అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్రా కార్యక్రమంలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పాల్గొన్నారు. ప్రభుత్వం ఎంపిక చేసిన "ఆరోగ్య పాఠశాలలు – ఆరోగ్య ఆంధ్రా" అంశంలో భాగంగా పాఠశాలను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో స్వచ్ఛాంధ్రా ప్రతిజ్ఞ చేయించారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇచ్చేలా పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు శిక్షణనివ్వాలని గంటా పేర్కొన్నారు. 627 మంది విద్యార్థులున్న పాఠశాలలో ఫలితాలు, సౌకర్యాల గురించి ఆరా తీశారు. హాస్టల్ లో నీటి సమస్య గురించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే బోరు ఏర్పాటు చేయాలని జోనల్ కమిషనర్ ను ఆదేశించారు. అనంతరం పాఠశాల ఆవరణలో పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు, ఏ.ఎం.హెచ్.ఓ. రాజా రవికుమార్, ప్రిన్సిపాల్ రత్నకుమారి, వైస్ ప్రిన్సిపాల్ శాంతకుమారి, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, లొడగల జానకిరాం, పోలిశెట్టి నాగేశ్వరరావు, మన్యాల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీలంకతో రెండో టెస్టుకు ముందు కుల్దీప్‌కు గంభీర్ కీలక సూచన!

- వికెట్ల కోసం తొందరపడొద్దని కుల్దీప్‌కు గంభీర్ సూచన
- మంచి స్పెల్‌పై దృష్టి పెట్టాలని సూచించిన గంభీర్
- 20 వికెట్లు తీయగల బౌలింగ్ దళమే లక్ష్యమని వివరణ
- పరిస్థితులకు తగ్గట్టే తుది జట్టును ఎంచుకుంటామని స్పష్టీకరణ
- కుల్దీప్‌ను అత్యంత ప్రమాదకర బౌలర్‌గా అభివర్ణన



**హైదరాబాద్ పెన్ పవర్:** వికెట్లు తీయాలనే ఆత్రుతతో బౌలింగ్ చేయకుండా మంచి స్పెల్ వేయడంపైనే దృష్టి పెట్టాలని భారత హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్.. స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌కు సూచించాడు. శ్రీలంకతో ఆదివారం ప్రారంభమయ్యే రెండో టెస్టు నేపథ్యంలో జట్టు కూర్పుపై చర్చ జరుగుతున్న వేళ ఈ వ్యాఖ్యలు చేశాడు.

గాలేలో జరిగిన తొలి టెస్టులో కుల్దీప్ ఒక్క వికెట్ మాత్రమే తీశాడు. దీంతో రెండో టెస్టులో అతడి స్థానం గురించి చర్చ జరుగుతోంది. జట్టులో సారాంశ్ జైన్ రూపంలో మరో స్పిన్ ఆల్‌రౌండర్ కూడా అందుబాటులో ఉన్నాడు.అయితే టెస్టు మ్యాచ్ గెలవాలంటే 20 వికెట్లు తీయగల అత్యుత్తమ బౌలింగ్ దళాన్ని ఎంపిక చేస్తామని గంభీర్ స్పష్టం చేశాడు. పరిస్థితులను బట్టి తుది జట్టును నిర్ణయిస్తామని చెప్పాడు.కుల్దీప్‌తో తన చర్చల గురించి మాట్లాడుతూ.. వికెట్ల కోసం అత్యాశ పడకుండా మంచి స్పెల్ వేయడంపైనే దృష్టి పెట్టాలని సూచించినట్లు తెలిపాడు. రిస్ట్ స్పిన్నర్లు వికెట్ల కోసం ఆత్రుత పడితే బౌలింగ్‌పై నియంత్రణ కోల్పోయే అవకాశం ఉంటుందని అన్నాడు.కుల్దీప్ సామర్థ్యంపై తమకు పూర్తి నమ్మకం ఉందని గంభీర్ పేర్కొన్నాడు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా అతడు ప్రమాదకర బౌలర్‌గా మారగలడని తెలిపాడు. అయితే పరిస్థితులకు అనుగుణంగా ఫలితం ఇచ్చే బౌలింగ్ దళానికే ప్రాధాన్యం ఉంటుందని స్పష్టం చేశాడు.గాలే టెస్టు పిచ్‌పై కూడా గంభీర్ సంతృప్తి వ్యక్తం చేశాడు. స్పిన్నర్లు, పేసర్లు, బ్యాటర్లకు ఆ పిచ్ సహకరించిందని అన్నాడు. ఐదు రోజుల పాటు తీవ్రంగా శ్రమిస్తేనే టెస్టు మ్యాచ్ గెలవగలమని చెప్పాడు.అలాగే ఐదుగురు ప్రధాన బౌలర్లతో ఆడటం జట్టుకు వ్యూహాత్మకంగా ప్రయోజనకరమని పేర్కొన్నాడు. ఫ్లాట్ పిచ్‌లపై బౌలర్లను రొటేట్ చేసేందుకు ఇది అవకాశం ఇస్తుందని తెలిపాడు.

# 15 ఏళ్ల వైభవ్.. టెస్టుల్లోనూ అదరగొడతాడా? ద్రవిడ్ ఏమన్నాడంటే!

- వైభవ్ టెస్టు క్రికెట్‌కు కొత్త ఊపు తేగలడన్న ద్రవిడ్
- దులీప్ ట్రోఫీలో ఈస్ట్ జోన్ తరఫున ఆడనున్న వైభవ్
- రెడ్‌బాల్ క్రికెట్‌లో వైభవ్‌కు మరింత అనుభవం అవసరమన్న ద్రవిడ్
- వైభవ్ ఎదుగుదలపై ఓపిక అవసరమని ద్రవిడ్ సూచన
- సెప్టెంబరులో ఆస్ట్రేలియా-ఏతో ఇండియా-ఏ అనధికారిక టెస్టులు



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 క్రికెట్‌లో సంచలనం సృష్టిస్తున్న వైభవ్ సూర్యవంశీ.. భవిష్యత్తులో టెస్టు క్రికెట్‌కు కొత్త ఉత్సాహాన్ని తీసుకురాగలడని భారత మాజీ కెప్టెన్ రాహుల్ ద్రవిడ్ అన్నాడు. అయితే 15 ఏళ్ల వైభవ్ ఎదుగుదలను జాగ్రత్తగా పర్యవేక్షించాలని సూచించాడు. అతడికి తగినంత సమయం, అనుభవం ఇవ్వాలని చెప్పాడు.వైభవ్ దులీప్ ట్రోఫీలో ఈస్ట్ జోన్ తరఫున ఆడనున్నాడు. వైట్‌బాల్ క్రికెట్‌లో ఇప్పటికే సత్తా చాటిన అతడికి.. రెడ్‌బాల్ క్రికెట్‌లో నిలకడ సాధించేందుకు ఇది కీలక అవకాశం. 2025 ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ తరఫున వైభవ్‌కు ద్రవిడ్ కోచ్‌గా వ్యవహరించాడు.వైభవ్ ఇప్పటివరకు ఎనిమిది ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడాడు. అతడి సగటు 17.25గా ఉంది. దేశవాళీ రెడ్‌బాల్ క్రికెట్‌లో ఎక్కువకాలం వరుసగా ఆడే అవకాశం అతడికి ఇప్పటివరకు పెద్దగా దక్కలేదు. దులీప్ ట్రోఫీతో ఆ లోటు తీరే అవకాశం ఉంది. సెప్టెంబరులో ఆస్ట్రేలియా-ఏతో ఇండియా-ఏ రెండు అనధికారిక టెస్టులు ఆడనుంది. ఈ మ్యాచ్‌లు కూడా వైభవ్‌కు ఉపయోగపడే అవకాశముంది.టీ20 క్రికెట్‌కు, టెస్టు క్రికెట్‌కు చాలా తేడా ఉంటుందని ద్రవిడ్ పేర్కొన్నాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో ఇన్నింగ్స్‌ను నిర్మించడం, ఒత్తిడిని తట్టుకోవడం, ఎక్కువసేపు ఏకాగ్రతతో బ్యాటింగ్ చేయడం వైభవ్ నేర్చుకోవాల్సి ఉంటుందని చెప్పాడు.వైభవ్ సూర్యవంశీకి ఇంకా 15 ఏళ్లేనని ద్రవిడ్ గుర్తు చేశాడు. అతడి కెరీర్‌లో విజయాలతో పాటు వైఫల్యాలు కూడా వస్తాయని పేర్కొన్నాడు. అందుకే అతడిపై ఓపికతో వ్యవహరించాలని సూచించాడు.టెస్టు క్రికెట్ మనుగడ సాగించాలన్నా, ఎదగాలన్నా మూడు ఫార్మాట్లలో ఆడగల ఆటగాళ్లు అవసరమని ద్రవిడ్ అన్నాడు. వైభవ్ భవిష్యత్తులో భారత్ తరఫున టెస్టు ఆటగాడిగా ఎదిగితే ప్రపంచ క్రికెట్‌కే అది ఆసక్తికర పరిణామమవుతుందని పేర్కొన్నాడు.

# 'లైక్స్, వ్యూస్ కాదు.. ట్రోఫీలే ముఖ్యం'.. గంభీర్ కీలక వ్యాఖ్యలు

- టెస్టుల్లో భారత్ ఇబ్బందుల్లో లేదన్న గంభీర్
- ర్యాంకింగ్స్ కంటే ట్రోఫీలు గెలవడమే లక్ష్యమని స్పష్టీకరణ
- శ్రీలంకపై భారత్ 1-0తో సిరీస్‌లో ఆధిక్యం
- గిల్, పడిక్కల్, సుతార్‌పై గంభీర్ విశ్వాసం
- 20 వికెట్లు తీసే బౌలింగ్ కూర్పే కీలకమని వెల్లడి



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత టెస్టు జట్టు కష్టాల్లో ఉందన్న వాదనను హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తోసిపుచ్చారు. ఇటీవల ఎదురైన పరాజయాలను పతనంగా చూడొద్దని అన్నారు. జట్టు ప్రస్తుతం మార్పుల దశలో ఉందని స్పష్టం చేశాడు. తనకు ర్యాంకింగ్స్, సోషల్ మీడియాలో లైక్స్, వ్యూస్ హడావుడి కంటే ట్రోఫీలు గెలవడమే ముఖ్యమని చెప్పాడు.శ్రీలంకతో రెండో టెస్టుకు భారత్ సిద్ధమవుతోంది. గాలేలో జరిగిన తొలి టెస్టులో భారత్ 165 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో రెండు టెస్టుల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో ఉంది. కొలంబో టెస్టుతో సిరీస్ విజేత ఎవరో తేలనుంది.రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవిచంద్రన్ అశ్విన్ టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలికిన తర్వాత భారత జట్టు భారీ మార్పులకు లోనైంది. న్యూజిలాండ్, దక్షిణాఫ్రికాతో స్వదేశీ సిరీస్‌ల్లో ఓటములు ఎదురయ్యాయి. ఆస్ట్రేలియా పర్యటనలోనూ భారత్‌కు నిరాశే ఎదురైంది. అయినా జట్టు గాడి తప్పిందని అనుకోవద్దని గంభీర్ అన్నాడు."మేం టెస్టు క్రికెట్‌లో ఇబ్బంది పడటం లేదు. ఇంగ్లండ్ పర్యటన తర్వాత సహేతుకమైన క్రికెట్ ఆడుతున్నాం. నా పని ట్రోఫీలు గెలవడం. నేను పట్టించుకునేది అదే" అని గంభీర్ స్పష్టం చేశాడు.కొత్త తరం ఆటగాళ్లపై గంభీర్ నమ్మకం వ్యక్తం చేశాడు. కొలంబోలో 20 వికెట్లు తీసే అత్యుత్తమ బౌలింగ్ కూర్పుతో బరిలోకి దిగుతామని చెప్పాడు. కుల్దీప్ యాదవ్ మంచి బౌలర్ అని పేర్కొన్నాడు. ఒకటి రెండు మ్యాచ్‌ల ప్రదర్శన ఆధారంగా ఆటగాళ్లను పక్కన పెట్టకూడదన్నాడు. క్రికెట్‌లో ఎత్తుపల్లాలు సహజమని, ఆటగాళ్లకు మరింత సమయం ఇవ్వాలని సూచించాడు. గిల్, పడిక్కల్, సుతార్‌లపై గంభీర్ విశ్వాసం ప్రకటించాడు.

మూడు టెస్టుల సిరీస్‌లకు గంభీర్ మద్దతు తెలిపాడు. తొలి టెస్టులో ఓడిన జట్టుకు పుంజుకునే అవకాశం మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఎక్కువగా ఉంటుందని చెప్పాడు. శ్రీలంకతో ప్రస్తుత సిరీస్ రెండు టెస్టులకే పరిమితం కావడంతో రెండో మ్యాచ్ ఫలితమే సిరీస్‌ను నిర్ణయించనుంది.






# జెట్ స్పీడ్‌లో ప్రజెట్ స్పీడ్‌లో ప్రభాస్ లైనప్ - హను రాఘవపూడితో మరో క్రేజీ ప్రాజెక్ట్!

ప్రస్తుతం రెబల్ స్టార్ ప్రభాస్ వరుస ప్రాజెక్ట్‌లతో జెట్ స్పీడ్‌లో దూసుకుపోతున్నారు. ఒకవైపు గ్లోబల్ ప్రాజెక్ట్‌లు చేస్తూనే.. మరోవైపు యువ దర్శకులతో ప్రయోగాత్మక చిత్రాలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారు. ఇప్పటికే పలు భారీ బడ్జెట్ సినిమాలతో బిజీగా ఉన్న ప్రభాస్ షెడ్యూల్‌లో మరో క్రేజీ ప్రాజెక్ట్ చేరనుందనే వార్తలు టాలీవుడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ప్రస్తుతం ప్రభాస్ నటిస్తోన్న -ఫౌజీ- షూటింగ్ చివరి దశకు చేరుకున్న విషయం తెలిసిందే. హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న పీరియాడిక్ వార్ డ్రామాపై అభిమానుల్లో భారీ అంచనాలున్నాయి.ఈ సినిమా సెట్స్‌లో దర్శకుడు హను రాఘవపూడి వర్కింగ్ స్టైల్, టేకింగ్ విధానం ప్రభాస్‌కు బాగా నచ్చినట్లు తెలుస్తోంది. ఈ సినిమా చిత్రీకరణ సమయంలో కథలోని డెప్త్, ఎమోషనల్ కంటెంట్ ప్రభాస్‌ను ఎంతగానో ఆకట్టుకున్నాయట. ఈ నేపథ్యంలోనే హను రాఘవపూడి చెప్పిన మరో సరికొత్త కథకు ప్రభాస్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు ఫిలిం నగర్ సర్కిల్స్‌లో జోరుగా ప్రచారం జరుగుతోంది. ఇద్దరి కాంబినేషన్‌లో వస్తోన్న -ఫౌజీ- అనుకున్న దానికంటే అద్భుతంగా రావడంతో? రిపీట్ కొలాబరేషన్‌కు తీస్తున్నట్లు సమాచారం.ఈ ప్రాజెక్ట్‌ను టాలీవుడ్‌లోని ప్రముఖ నిర్మాణ సంస్థలలో ఒకటైన హోంబలే ఫిలిమ్స్ - మైత్రి మూవీ మేకర్స్ సంస్థల్లో ఏదో ఒకటి నిర్మించే అవకాశం ఉందంటున్నారు. ఇప్పటికే ఈ ప్రొడక్షన్ హౌస్‌లతో ప్రభాస్‌కు మంచి అనుబంధం ఉండటంతో త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే ఛాన్స్ ఉందంటున్నారు. మరోవైపు ప్రభాస్ ఖాతాలో ప్రకంపనలు సృష్టించేందుకు సిద్ధంగా ఉన్న -కల్కి 2-, సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కుతోన్న -స్పిరిట్-.. అలాగే ప్రశాంత్ నీల్ తో -సలార్ 2- వంటి భారీ చిత్రాలు క్యూలో ఉన్నాయి.ఇలాంటి బిజీ షెడ్యూల్ మధ్యలోనూ మరో కొత్త సినిమాకు డార్లింగ్ డేట్స్ కేటాయించడం ప్రభాస్ నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తోంది. ఒకరి తర్వాత ఒకరుగా క్రేజీ ప్రాజెక్ట్‌లను లైన్‌లో పెడుతున్న రెబల్ స్టార్ వేగం చూస్తుంటే రాబోయే రెండు.. మూడేళ్లలో బాక్సాఫీస్ రికార్డులన్నీ డార్లింగ్ పేరిట ఖాయమనిపిస్తోంది. వరుస పాన్-ఇండియా చిత్రాలతో తెలుగు సినిమా స్థాయిని ప్రపంచవ్యాప్తంగా నెక్స్ట్ లెవెల్‌కు తీసుకువెళ్తున్నారు. ప్రభాస్ తో పాటు బన్నీ కూడా అదే రేంజ్ లో కెరీర్ ని ప్లాన్ చేసుకుని ముందుకెళ్తున్నారు. ఇదే తరహాలో రామ్ చరణ్, ఎన్టీఆర్, మహేష్ కూడా భవిష్యత్ ప్రాజెక్ట్ లను ప్లాన్ చేసుకుంటున్నారు. ఇప్పటికే వారంతా కూడా తదుపరి చిత్రాల విషయంలో ఓ నిర్ణయానికి వచ్చారు

భాస్ లైనప్ - హను రాఘవపూడితో మరో క్రేజీ ప్రాజెక్ట్!

ప్రస్తుతం రెబల్ స్టార్ ప్రభాస్ వరుస ప్రాజెక్ట్‌లతో జెట్ స్పీడ్‌లో దూసుకుపోతున్నారు. ఒకవైపు గ్లోబల్ ప్రాజెక్ట్‌లు చేస్తూనే.. మరోవైపు యువ దర్శకులతో ప్రయోగాత్మక చిత్రాలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారు. ఇప్పటికే పలు భారీ బడ్జెట్ సినిమాలతో బిజీగా ఉన్న ప్రభాస్ షెడ్యూల్‌లో మరో క్రేజీ ప్రాజెక్ట్ చేరనుందనే వార్తలు టాలీవుడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ప్రస్తుతం ప్రభాస్ నటిస్తోన్న -ఫౌజీ- షూటింగ్ చివరి దశకు చేరుకున్న విషయం తెలిసిందే. హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న పీరియాడిక్ వార్ డ్రామాపై అభిమానుల్లో భారీ అంచనాలున్నాయి. ఈ సినిమా సెట్స్‌లో దర్శకుడు హను రాఘవపూడి వర్కింగ్ స్టైల్, టేకింగ్ విధానం ప్రభాస్‌కు బాగా నచ్చినట్లు తెలుస్తోంది. ఈ సినిమా చిత్రీకరణ సమయంలో కథలోని డెప్త్, ఎమోషనల్ కంటెంట్ ప్రభాస్‌ను ఎంతగానో ఆకట్టుకున్నాయట. ఈ నేపథ్యంలోనే హను రాఘవపూడి చెప్పిన మరో సరికొత్త కథకు ప్రభాస్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు ఫిలిం నగర్ సర్కిల్స్‌లో జోరుగా ప్రచారం జరుగుతోంది. ఇద్దరి కాంబినేషన్‌లో వస్తోన్న -ఫౌజీ- అనుకున్న దానికంటే అద్భుతంగా రావడంతో? రిపీట్ కొలాబరేషన్‌కు తీస్తున్నట్లు సమాచారం.




Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965